ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

రాజన్న సిరిసిల్ల

జిల్లా వార్తలు

5★★★

ఆదివారం 24 ఆగస్టు 2025



అన్నదాతల తండ్లాట



కొత్తపల్లి సంఘం వద్ద రైతులు (ఫైల్)



కోనరావుపేట సంఘం వద్ద రైతులు (ఫైల్)

- యూరియా కోసం పొద్దంతా సహకార సంఘాల వద్ద పడిగాపులు
- ఒకవైపు క్యూ.. మరోవైపు ఆందోళనలు
- జిల్లాకు 25,370 మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని అంచనా
- ఇప్పటివరకు 13,217 మెట్రిక్ టన్నులు పంపిణీ..

జిల్లాలో ఇప్పటివరకు వానకాలం పాగు ఇలా..

మండలం	మొత్తం	వరి	పత్తి
గంభీరావుపేట	18598	18500	85
ఇల్లంతకుంట	36970	24000	12000
ముస్తాబాద్	23835	23000	530
సిరిసిల్ల	5623	4800	800
తంగళ్లపల్లి	21086	20100	870
వీర్నపల్లి	8300	8000	300
ఎల్లారెడ్డిపేట	21100	17500	3600
బోయినపల్లి	19167	12600	6400
చందుర్తి	21367	15100	6200
కోనరావుపేట	23140	18300	4800
రుద్రంగి	10964	5910	2200
వేములవాడ	10038	5200	4800
వేములవాడరూరల్	15142	11300	3800
మొత్తం	235330	184310	46385

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

నైరుతి నై అంటూ మొఖం చాటేసినా.. అల్ప పీడనం వర్షాలు రైతులను మురిపించాయి. ఖరీఫ్ సాగు కు ఊపిరినిచ్చిన వర్షాలతో రాజన్న సిరిసిల్ల జిల్లాలో వానాకాలం సాగు వ్యవసాయశాఖ అంచనాలకు చేరువైంది. జిల్లాలో పచ్చని పైర్లు రైతుల్లో ఆశలు పెంచుతుంటే యూరియా రైతులకు తండ్లాటగా మారింది. జిల్లాలో ప్రస్తుతం రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య యూరియాగా మారింది. వ్యవసాయ సహకారసంఘాలకు ఎరువులు వస్తున్నాయని తెలియగానే తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు క్యూలైన్లతో రైతులు పడిగాపులు పడుతున్నారు. నిలబడే ఓపిక లేక రైతులు చెప్పులు లైన్లో పెడుతున్నారు. మరోవైపు ఎరువుల కోసం రోడ్డెక్కి ఆందోళనలు, నిరసనలు వ్యక్తం చేస్తున్నారు.

సహకార సంఘాలకు యూరి యా రావడంతోనే పోలీసు బందోబస్తు మధ్య పంపిణీ చేస్తున్న తీరు జిల్లాలో కనిపిస్తోంది. రైతులకు ఇబ్బందులు కలగకుండా అధికార యంత్రాంగం యూరియా పంపిణీకి చర్యలు చేపడుతున్నారు. కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పంటల సాగుకు అనుగుణంగా యూరియా తెప్పిస్తున్నామని రైతులు ఆందోళన చెందవద్దని భరోసా ఇస్తున్నారు.

● ఇంకా రావాల్సింది 12,153 మెట్రిక్ టన్నులు..

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు వ్యవసాయశాఖ యాక్షన్‌ప్లాన్ ప్రకారం యూరియా 25,370 మెట్రిక్‌టన్నులు అవసరం అవుతుందని అంచనా వేశారు. గంభీరావుపేట మండలానికి 1940 మెట్రిక్ టన్నులు, ఇల్లంతకుంట మండలానికి 3850 మెట్రిక్ టన్నులు, ముస్తాబాద్ మండలానికి 2800 మెట్రిక్ టన్నులు, సిరిసిల్ల మండలానికి 600 మెట్రిక్‌టన్నులు, తంగళ్లపల్లికి 2200మెట్రిక్ టన్నులు, వీర్నపల్లికి 900...

- మిగతా 8లో

మట్టి గణపతి విగ్రహాలను పూజించాలి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణహితమైన మట్టి గణపతి విగ్రహాలను పూజించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పిలుపునిచ్చారు. శనివారం కలెక్టర్ ఛాంబర్‌లో కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో మట్టి గణపతులపై అవగాహన కల్పించేందుకు రూపొందించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరణ చేశారు. పర్యావరణ సంరక్షణ కోసం జిల్లాలో కాలుష్యనియంత్రణ మండలి ఆధ్వర్యంలో రెండు వేల మట్టి గణపతి విగ్రహాలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీల ఆధ్వర్యంలో ప్రజలకు ఉచితంగా ఇట్టి విగ్రహాలను పంపిణీ చేయడం జరుగుతుందని అన్నారు. వినాయక చవితి ఉత్సవాలు ప్రజలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి అసిస్టెంట్ సైంటిస్ట్ జ్యోతి, కలెక్టరేట్ పర్యవేక్షకులు ప్రవీణ్, రాంచందర్, తహశీల్దార్ ఫారూక్, తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి

- అదనపు కలెక్టర్‌కు టీపీయూఎస్ నాయకుల వినతి

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : సీపీఎస్ విధానాన్ని వెంటనే ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(టీపీయూఎస్) నాయకులు శనివారం అదనపుకలెక్టర్ గడ్డం నగేష్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా టీపీయూఎస్ జిల్లా అధ్యక్షుడు గసికంటి శ్రీనివాస్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో మేనిఫెస్టోలో ప్రకటించిన ప్రకారం 2004 సెప్టెంబరు 1 తర్వాత నియామకమైన రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని అమల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీపీయూసీ జిల్ల ప్రధాన కార్యదర్శి లెంకల జయకృష్ణారెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు జగన్‌మోహన్, శ్రీనివాస్, నాయకులు బాల్‌రెడ్డి, ఉప్పల శ్రీనివాస్, బిళ్ల శ్రీకాంత్, నరేందర్, ప్రవీణ్, తిరుపతి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

తప్పుడు ధ్రువీకరణతో పెన్షన్ పొందడంపై ఫిర్యాదు

ముస్తాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : అంధత్వం ఉందని తప్పుడు ధృవీకరణ పత్రాలను సమర్పించి పదేళ్లకు పైగా పెన్షన్ పొందుతూ ప్రభుత్వధనాన్ని దుర్వినియోగం చేస్తున్న వ్యక్తిపై కలెక్టర్‌కు మండలంలోని గూడూరు మాజీ సర్పంచ్ చీటి వెంకటనర్సింగరావు శనివారం ఫిర్యాదు చేశారు. గూడూరుకు చెందిన సిద్దుల భిక్షపతి అనే వ్యక్తి కంటి చూపి లేదంటూ, లైసెన్స్ లేకుండా ఆటో నడుపుతూ పదేళ్లకు పైగా అక్రమంగా పెన్షన్‌ను పొందుతున్నాడని ఎవరైనా ప్రశ్నిస్తే దురుసుగా వ్యవహరిస్తాడని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీలో మల్టీపర్పస్ వర్కర్‌గా పనిచేస్తు విధులను సైతం సరిగా నిర్వర్తించడం లేదని ఆరోపించారు. విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

సైబర్ వలలో ఉన్నతాధికారి..?

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఓ ఉన్నతాధికారి సైబర్ వలలో చిక్కారని తెలిసింది. శనివారం ఓ ఉన్నతాధికారి ఐడీని హ్యాక్‌చేసిన సైబర్ నేరస్థుడు మరో ఉన్నతాధికారిని నమ్మించి రూ.50వేలు కాజేశాడు. జిల్లాలో ఓ ఉన్నతాధికారికి అత్యవసరంగా డబ్బులు అవసరం ఉన్నాయని సైబర్ నేరస్థుడి మెస్సేజ్‌ని నమ్మిన సదరు ఉన్నతాధికారి రూ.50వేలు పంపి మోసపోయాడు. ఈ విషయమై ఉన్నతాధికారి దృష్టికి తీసుకెళ్లి సైబర్ పోలీసులకు సమాచారం అందించారని తెలిసింది.

యూరియా కోసం పడిగాపులు

చందుర్తి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి):మండలంలోని సనుగుల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో శనివారం రైతులకు టోకెన్లను జారీ చేసి యూరియా బస్తాలను సరఫరా చేశారు. సొసైటీకి శుక్రవారం 225బస్తాల యూరియా బస్తాలు రాగా, శనివారం ఒక్కో రైతుకు ఎకరానకు ఒకటి, రెండు యూరియా బస్తాలను చొప్పున టోకెన్ల ప్రకారం పంపిణీ చేశారు. ఉదయం పది గంటలకు పంపిణీ కావాల్సి ఉండగా, సాంకేతిక సమస్య కారణంగా మధ్యాహ్నం 12 గంటలకు చేపట్టారు. దీంతో రైతులు పడిగాపులు కాయాల్సి వచ్చింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసుల పహారాలో యూరియా పంపిణీ చేశారు.

ఉపకార వేతనాలను సద్వినియోగం చేసుకోవాలి

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): బీడీకార్మికుల పిల్లలకు ప్రభుత్వం అందిస్తున్న ఉపకార వేతనాలను సద్వినియోగం చేసుకోవాలని అసిస్టెంట్‌లేబర్ అధికారి నజీం హైమద్ అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో బీడీ కార్మిక పిల్లలకు ఉపకారవేతనాలపై శనివారం అవగాహన కల్పించారు. నజీం హైమద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బీడీ కార్మికుల పిల్లల ఉన్నత చదువుల కోసం ఉపకార వేతనాలను అందిస్తోందన్నారు. పీఎఫ్ ధృవీకరణ పత్రాలు ఉన్న బీడి కార్మికులు ఈనెల 31లోగా దరఖాస్తులు చేసుకోవాలని నజీంహైమద్ అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ముక్తర్‌పాషా, ఎంపీడీవో బీరయ్య, పంచాయతీ కార్యదర్శులు, బీడి కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

26న పూలే దంపతుల విగ్రహాల ఆవిష్కరణ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణంలో మహాత్మ జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే దంపతుల విగ్రహాల ఆవిష్కరణ మహోత్సవంను ఈనెల 26న నిర్వహిస్తున్నట్లు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ నాయకులు అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి సహకారంతో మహాత్మా జ్యోతిబా పూలే జయంతి రోజున అంబేద్కర్ చౌరస్తా జిల్లా గ్రంథాలయం సంస్థ కార్యాలయం ఎదుట పూలే దంపతుల విగ్రహాలను ఏర్పాటు చేసినట్లు, ఈనెల 26న ఉదయం 11 గంటలకు జరిగే ఆవిష్కరణలో అన్నివర్గాల ప్రజలు పాల్గొన్నాలని కోరారు. ఈ సమావేశంలో మున్నూరుకాపు సంఘం జిల్లా అధ్యక్షుడు బొప్ప దేవయ్య, ముదిరాజ్ జిల్లా అధ్యక్షుడు చొక్కాల రాము, తెలంగాణ అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు కత్తెర దేవదాస్, మాల మహానాడు జాతీయ కార్యదర్శి రాగుల రాములు, నాయకులు సంగీతం శ్రీనివాస్, గోనె ఎల్లప్ప, ఆకునూరి బాలరాజు, కోల నరేష్, దండు శ్రీనివాస్, పంబాల దేవరాజు, మోతే బాబు పాల్గొన్నారు.

మల్కపేట జలాశయాన్ని నింపాలని వినతి

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం మల్కపేట జలాశయాన్ని నింపాలని కోరుతూ శనివారం వేములవాడలో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు వినతిపత్రం సమర్పించామని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య పేర్కొన్నారు. రాజరాజేశ్వర ప్రాజెక్ట్ నుంచి పదో ప్యాకేజీ ద్వారా నీటిని తరలిస్తున్న నేపథ్యంలో మల్కపేట జలాశయానికి జలకళను తీసుకురావాలని విన్నవించామని తెలిపారు. మూడు టీఎంసీల సామర్థ్యం కలిగిన మల్కపేట ప్రాజెక్ట్ నిండితే ఎగువ ప్రాంతంలోని రైతులకు ప్రయోజనం చేకూరుతోందన్నారు. స్పందించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నీటి పారుదల శాఖ అధికారులతో మాట్లాడి నీటి విడుదలకు ఆదేశాలను జారీ చేశారని నర్సయ్య పేర్కొన్నారు. నాయకులు రాంరెడ్డి, బాపురెడ్డి ఉన్నారు.

మహాధర్నా పోస్టర్ ఆవిష్కరణ

గంభీరావుపేట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గజసింగవరంలో శనివారం ఉపాధ్యాయులు మహాధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. సెప్టెంబర్ 1న పాత పెన్షన్ సాధనే లక్ష్యంగా పీఆర్‌టీయూ టీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించతలపెట్టిన మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు గన్నమనేని శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. పీఆర్‌టీయూ టీఎస్ సభ్యత్వ నమోదులో భాగంగా గంభీరావుపేట మండలంలోని పలు గ్రామాల్లోని పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వాన్ని ఒప్పించి సమస్యల సాధనలో పీఆర్‌టీయూ టీఎస్ ముందుంటుందని, ఉపాధ్యాయుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మర్గాల రాజేష్, మండల ప్రధాన కార్యదర్శి సంబారి లక్ష్మీనారాయణ, నాయకులు పొన్నాల బాల్‌రెడ్డి, కుమార్, సాయి, షఫి, ప్రవీణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

వినాయక నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల కలెక్టరేట్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వినాయక నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం నవరాత్రి ఉత్సవాలు, వినాయక నిమజ్జనం, మిలాద్‌ఉన్ నబీ పండుగల సందర్భంగా పీస్ కమిటీ సమావేశాన్ని ఎస్పీ మహేష్ బీ గీతేతో కలిసి కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 27 నుంచి సెప్టెంబర్ 6వ తేదీవరకు జరిగే వినాయక నవరాత్రి ఉత్సవాలు, వినాయక నిమజ్జనం కార్యక్రమాలు సిరిసిల్ల జిల్లాలో ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. వేములవాడ పట్టణంలోసెప్టెంబర్4, సిరిసిల్లలో సెప్టెంబర్ 6న వినాయక నిమజ్జనం జరగాలని, దానికి తగిన విధంగా రెవెన్యూ, నీటిపారుదల, పోలీస్, ఫిషరీస్, ఇతర శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. వినాయక మండపాలకు నిమజ్జనం రోజు విద్యుత్ సరఫరా నిరంతరాయంగా కొనసాగాలని, నిమజ్జనం పాయింట్ల వద్ద పవర్ జనరేటర్‌లను సిద్ధం చేయానలి సూచించారు. వినాయక నిమజ్జనానికి ప్రణాళికలను రూపొందించుకోవాలని నిమజ్జనం చేసుకునేందుకు అవసరమైన రూట్ మ్యాప్‌లను సిద్ధం చేసుకోవాలన్నారు. నిమజ్జనం రూట్‌లో అవరసమైన రోడ్డు మరమ్మతుల పనులు వెంటనే చేపట్టి పూర్తి చేయాలని కోరారు. సిరిసిల్ల, వేములవాడప్రాంతాల్లో వినాయక నిమజ్జనం జరిగే ప్రదేశాల్లో మూడు చొప్పున క్రేన్లు, పది మంది చొప్పున గజ ఈతగాళ్లను సిద్ధం చేయాలన్నారు. నిమజ్జనం వద్ద అగ్ని ప్రమాదాలను నివారించేందుకు సిరిసిల్ల పట్టణంలో1, వేములవాడ పట్టణంలో 1 అగ్నిమాపక వాహనాలను ఇతరప్రాంతాలకు టూవీలర్స్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి వినాయక మండపం వద్ద అవసరమైన మేర బందోబస్తును ఏర్పాటు చేయాలని, వినాయక నిమజ్జనం సజావుగా జరిగే విధంగా కట్టుదిట్టమైన భద్రతా వ్యవస్థను ఏర్పాటుచేయాలన్నారు. నిమజ్జన ఏర్పాట్లు పకడ్బందీగా జరగాలని, కులమతాలకు అతీతంగా అన్ని వర్గాల సహకారంతో కలిసికట్టుగా పండుగ వాతావరణంలో జరుపుకోవాలని కోరారు. ఎస్పీ మాట్లాడుతూ మిలాద్ ఉన్‌నబీ, వినాయక నిమజ్జనం కలిసి వస్తున్న నేపథ్యంలో మతసామరస్యం దెబ్బతినకుండా పకడ్బందీ భద్రత వ్యవస్థ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈసమావేశంలో ముస్లిం మతపెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

గణేశ్ ఉత్సవాలు శాంతియుతంగా జరుపుకోవాలి

- డీజేలకు అనుమతి లేదు - నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు - ఎస్పీ మహేష్ బి. గీతే



మాట్లాడుతున్న ఎస్పీ మహేష్ బి. గీతే

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): శాంతియుత వాతావరణంలో గణేష్ ఉత్సవాలు జరుపుకోవాలని ఎస్పీమహేష్ బి. గీతే అన్నారు. రానున్న గణేశ్ ఉత్సవాల సందర్భంగా శనివారం సాయంత్రం సిరిసిల్ల పట్టణంలోని పద్మనాయక కళ్యాణమండపంలో సిరిసిల్ల సబ్ డివిజన్‌లోని గణేశ్ మండపాల నిర్వాహకులు, హిందూ ఉత్సవ కమిటీ సభ్యులతో ఏర్పాటుచేసిన సమన్వయ సమావేశంలో ఎస్పీ దిశానిర్దేశం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండపాల వద్ద, నిమర్జనం సమయంలో డీజేలకు అనుమతిలేదన్నారు. ఇప్పటికే డీజే యజమానులకు కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు. ప్రతిఒక్కరు ఆన్‌లైన్‌లో అనుమతి తీసుకోవాలన్నారు. గణేశ్ మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటుచేసుకోవాలన్నారు. గణేశ్ ఉత్సవాల్లో నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు. మండపాల పూర్తి బాధ్యత నిర్వాహకులదేనని, ప్రతి మండపం వద్ద సీసీ కెమెరాల నిఘా ఉండాలన్నారు. దీంతో ఏ చిన్న సంఘటన జరిగినా గుర్తించే వీలుంటుందన్నారు. మండపాల వద్ద మద్యం సేవించడం, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే వారితో పాటుగా మండపాల నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రతి మండపం వద్ద విధిగా బుక్ పాయింట్ ఏర్పాటుచేస్తామన్నారు. గణేశ్ మండపాలను తరచుగా పోలీసులు తనిఖీలు చేస్తారన్నారు. మండపాలను ఇనుప వస్తువులతో ఏర్పాటు చేయకూడదని, విద్యుత్ శాఖ అనుమతి తీసుకోవాలన్నారు. గణేశ్ శోభాయాత్రను అర్ధరాత్రి 12గంటల వరకు పూర్తిచేసే బాధ్యతను నిర్వాహకులు తీసుకోవాలన్నారు. ప్రజలకు శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గత ఏడాది శాంతిభద్రతలకు విఘాతం కలిగించినవారిపై కేసులు నమోదుచేశామన్నారు. సమావేశంలో సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఖాదిర్‌పాషా, టౌన్ సీఐ కృష్ణ, ఎస్ఐ శ్రీకాంత్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు దూమాల శ్రీకాంత్, విశ్వహిందూ పరిషత్ సభ్యులు చేపూరి అశోక్, మేర్గు సత్యనారాయణ, అన్నిమండలాల పలు పార్టీల నాయకులు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

జిల్లాలో నలుగురు ఎస్ఐల బదిలీ

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నలుగురు ఎస్ఐలను బదిలీ చేస్తూ ఎస్పీ శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న బోయిన్‌పల్లి ఎస్ఐ రాజ్‌కుమార్‌ను డీసీఆర్‌బీకి, గంభీరావుపేట ఎస్ఐగా పనిచేస్తున్న రమాకాంత్‌ను బోయినపల్లి ఎస్ఐగా, వేములవాడ ఎస్ఐ అనిల్ కుమార్‌ను గంభీరావుపేట ఎస్ఐగా, స్పెషల్ బ్రాంచి ఎస్ఐ వెంకట్రాజంను వేములవాడ టౌన్ ఎస్ఐగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

సురవరం మృతి తీరని లోటు



సురవరం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : భారత కమ్యూనిస్టు పార్టీ మాజీ జాతీయ కార్యదర్శి మాజీ ఎంపీ సురవరం సుధాకర్ సుధాకర్ రెడ్డి మృతి దేశంలోని కార్మిక, కర్ష వర్గానికి తీరని లోటని సీపీఐ సిరిసిల్ల పట్టణ కార్యదర్శి పంతం రవి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సీపీఐ పార్టీ కార్యాలయంలో సురవరం సుధాకర్‌రెడ్డి మృతిపై సీపీఐ నాయకులు సంతాపం తెలిపారు. ఆయన చిత్రపటానికి పూలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ సురవరం తండ్రి వెంకట్రామిరెడ్డి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు ఆయన అడుగుజాడల్లోనే సురవరం సుధాకరెడ్డి నడుస్తూ ఏఐఎస్ఎఫ్ నుండి సీపీఐ జాతీయ కార్యదర్శి స్థాయికి ఎదిగాడన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం సురవరం అహర్నిశలు కృషి చేశారని, తెలంగాణ ఉద్యమానికి పూర్తి మద్దతును తెలిపి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజనకు కృషి చేశారన్నారు. జాతీయ నాయకుడు సురవరం సుధాకర్‌రెడ్డి మరణం సీపీఐకి తీరని లోటన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కడారి రాములు, సోమ నాగరాజు, పందుగ పోషమల్లు, ఆకుల అంజనేయులు, లాల శ్రీను, పందుగ చంద్రయ్య, దయ్యాల అంజయ్య పాల్గొన్నారు.

హత్యకేసులో మరో ముగ్గురు అరెస్టు

గంగాధర, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): గంగాధరలో వృద్ధురాలి హత్య కేసులో ప్రధాన నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచినట్లు ఎస్‌ఐ వంశీకృష్ణ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం గంగాధర గ్రామానికి చెందిన పెగుడ మల్లవ్వ(70)ను ఈనెల 17న హత్య చేశారు. ఈ కేసులో ఈనెల 20న ఇద్దరు నిందితులను పట్టుకోగా ప్రధాన నిందితుడు నాగిరెడ్డిపూర్‌కు చెందిన గంగరాజు, మరో ఇద్దరు సహ నిందితులు పరారీలో ఉన్నారు. నిందితుల కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి శనివారం పట్టుకున్నట్లు తెలిపారు. నిందితులవద్ద మూడు తులాల బంగారం, రెండు సెల్‌ఫోన్ల స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యార్థినులను కరిచిన ఎలుకలు

- విచారణ చేపట్టిన ఎంఈవో


కేజీబీవీలో విచారణ చేపడుతున్న ఎంఈవో లక్ష్మీనారాయణ

శంకరపట్నం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినులను ఎలుకలు కరిచిన ఘటన శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కేశవపట్నం కేజీబీవీలో తొమ్మిదో తరగతి చదువుతున్న తొమ్మిది మంది విద్యార్థునులను గురువారం రాత్రి ఎలుకలు కరిచాయి. విషయం తెలుసుకున్న ఎంఈవో లక్ష్మీనారాయణ, ఎంపీవో ప్రభాకర్, మండల వైద్యాధికారి డాక్టర్ శ్రావణ్‌కుమార్ కేజీబీవీని శనివారం సందర్శించారు. ఎలుకల దాడిలో గాయపడిన విద్యార్థునులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఘటనపై అధికారులు వివరాలు సేకరించారు. ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించనున్నట్లు తెలిపారు.

సౌదీ అరేబియా జైల్లో గుండెపోటుతో వ్యక్తి మృతి

- స్వగ్రామం చేరిన మృతదేహం


రాజయ్య(ఫైల్)

వేములవాడ టౌన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని నాంపల్లి గ్రామానికి చెందిన దండుగుల రాజయ్య(50) అనే వ్యక్తి ఉపాధి కోసం సౌదీ అరేబియా దేశం వెళ్లాడు. అతను వెళ్లింది విజిట్ వీసా కావడంతో జూలై 24వ తేదిన అక్కడి పోలీసులు జైలుకు పంపారు. జూన్ 30వ తేదిన జైల్లో ఉండగానే గుండెపోటుతో రాజయ్య మృతిచెందాడు. దీంతో రాజయ్య మృతదేహం శుక్రవారం రాత్రి స్వగ్రామం చేరుకుంది. మృతుడికి భార్య రాజమణి, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు.

పడకేసిన బయోమైనింగ్

- వినియోగంలో లేని ప్లాంట్
- మెట్‌పల్లిలో పేరుకుపోతున్న ఘన వ్యర్థాలు


డంపింగ్ యార్డు వద్ద బయో మైనింగ్ ప్లాంట్ (ఫైల్)

మెట్‌పల్లిటౌన్, ఆగస్టు23 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీల్లోని డంపింగ్ యార్డుల్లో పేరుకుపోతున్న చెత్త నిల్వలను తగ్గించడంతో పాటు ఎరువు తయారు చేసేందుకు మెట్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలో ఏర్పాటు చేసిన బయో మైనింగ్ ప్లాంట్ పడకేసింది. పేరుకుపోతున్న ఘన వ్యర్థాల సమస్యను పరిష్కరించేందుకు గత జూలైలో పట్టణంలోని గోధుర్ రోడ్‌లో ఉన్న డంపింగ్ యార్డులో ఏర్పాటు చేసిన బయో మైనింగ్ ప్లాంట్ వినియోగించడం లేదు. డంపింగ్ యార్డులో వందల మెట్రిక్ టన్నులకు పైగా చెత్త పేరుకుపోయింది. జీరో డంపింగ్ యార్డు లక్ష్యంగా బయో మైనింగ్ ఏర్పాటు చేసి నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు అధికారులు చెత్తను శుద్ధి చేయకపోవడంతో మెట్‌పల్లిలో డంపింగ్ యార్డు పూర్తిగా నిండిపోయింది. పక్కన ఉన్న ఖాళీ స్థలంలో


డంపింగ్ యార్డులో పేరుకుపోయిన చెత్త చెదారం

కూడా చెత్త నిండిపోయిం ది. దీంతో డంపింగ్ యార్డు చుట్టు పక్కల వ్యవసాయం చేసే రైతులు అటువైపు వెళ్లేందుకు జంకుతున్నారు. చెత్త పేరుకుని చుట్టు పక్కల దుర్వాసన రావడంతో పాటు డంపింగ్ యార్డు వద్ద కుక్కల బెడద కూడా అధికంగా ఉన్నది. డంప్ యార్డు పక్కన వ్యవసాయ పనులకు కూలీలు రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఘన వ్యర్థాలను ఎప్పటికప్పుడు శుద్ధి చేయించాల్సిన అధికారులు వర్షాలను సాకుగా చూపుతున్నారు.

● జీరో డంపింగ్ యార్డులే లక్ష్యం

మున్సిపాలిటీలలో రోజురోజుకు పెరుకుపోతున్న చెత్త ఘన వ్యర్థాలను శుద్ధి చేసి జీరో డంపింగ్ యార్డులే లక్ష్యంగా ప్రభుత్వం బయో మైనింగ్‌కు శ్రీకారం చుట్టింది. పట్టణంలో నిత్యం టన్నులకు టన్నులు ఉత్పత్తి అవుతున్న చెత్తను పారిశుధ్య కార్మికులు సేకరించి డంపింగ్ యార్డుకు తరలిస్తు న్నారు. డంపింగ్ యార్డులో నిల్వ ఉన్న వ్యర్థాలను దహనం చేయడం వల్ల వచ్చే పొగతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తరచూ పొగతో సమీప ప్రాంతాల వారు అనారోగ్యం పాలయ్యే అవకా శముంది. పెద్ద ఎత్తున చెత్త పోగుకావడంతో స్థలం సరిపోక నిల్వ ఉంచడం కష్టంగా మారింది. జాతీయ హరిత ట్రిబ్యునల్ మార్గదర్శకాల ప్రకారం మున్సిపాలిటీలలో వ్యర్థాలను కరిగించేందుకు ప్రభుత్వం బయో మైనింగ్ ప్లాంట్‌కు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా జిల్లాలో మొదటగా జగిత్యాల, కోరుట్ల మున్సిపాలిటీలలో ఏర్పాటు చేశారు. అనంతరం మెట్‌పల్లిలో ఏర్పాటు చేశారు. ఇప్పటికే జగిత్యాల, కోరుట్లలో బయో మైనింగ్ విజయవంతంగా సాగు తోంది. చెత్తతో బయో మైనింగ్ ద్వారా ఎరువు తయారు చేస్తున్నారు. మెట్ ఎల్లి పట్టణంలో ఏర్పాటు చేసిన బయోమైనింగ్ కొన్ని రోజులు నడిపించి నిలిపివేశారు. వర్షాల కారణంగా శుద్ధి పనులు నిలిపివేసినట్లు అధికారులు చెపుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బయో మైనింగ్ చేపట్టాలని మెట్‌పల్లి పట్టణ ప్రజలు కోరుతున్నారు.

వర్షాలు తగ్గుముఖం పట్టిన వెంటనే ప్రారంభిస్తాం

-టి. మోహన్, మున్సిపల్ కమిషనర్, మెట్‌పల్లి



వర్షాల కారణంగా బయో మైనింగ్ శుద్ధి పనులు నిలిచిపోయాయి. డంపింగ్ యార్డులో ప్రస్తుతం 32 వేల మెట్రిక్ టన్నుల చెత్త ఉంది. వర్షాలు తగ్గుముఖం పట్టిన వెంటనే శుద్ధి పనులు చేపడుతాం. నాలుగు నెలల్లో పూర్తి స్థాయిలో జీరో డంపింగ్ యార్డుగా తీర్చిదిద్దుతాం.

ఇసుక ట్రాక్టర్ పైనుంచి పడి యువకుడి మృతి


నర్రా శేఖర్(ఫైల్)

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం జగ్గసాగర్ గ్రామ శివారులోని దొంగలమర్రి దగ్గర శుక్రవారం రాత్రి ఇసుక ట్రాక్టర్‌పై నుంచి పడి నర్రా శేఖర్ (29) అనే యువకుడు మృతిచెందాడు. మృతుడి బంధువులు, ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మెట్‌పల్లి మండలం ఆత్మనగర్ గ్రామానికి చెందిన శేఖర్ అదే గ్రామానికి చెందిన బండ శ్రీనివాస్‌కు సంబంధించిన ట్రాక్టర్‌కు డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గ్రామంలో డంప్ చేసిన ఇసుకను బండలింగాపూర్‌కు తరలించేందుకు దాండ్ల రవి అనే వ్యక్తితో నర్రా శేఖర్ ట్రాక్టర్‌తో వెళ్లారు. దాండ్ల రవి ట్రాక్టర్‌ను నడుపుతుండగా శేఖర్ వెనుకలా ఉన్నాడు. ఈ క్రమంలో జగ్గసాగర్ గ్రామ శివారులో దొంగలమర్రి వద్ద ప్రమాదవశాత్తు నర్రా శేఖర్ ట్రాక్టర్‌పై నుంచి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. శేఖర్ భార్య ఏడు నెలల గర్భవతి కాగా, అతడికి 20 నెలల కూతురు ఉంది. శేఖర్ కుటుంబానికి న్యాయం చేయాలని మృతుడి బంధువులు మెట్‌పల్లి పోలీసు స్టేషన్‌కు పెద్దఎత్తున తరలివచ్చారు. నిందితులపై కేసు నమోదు చేసి విచారణ చేసి చర్యలు తీసుకుంటామని ఎస్సై సముదాయించడంతో బాధితులు వెనుతిరిగి వెళ్లారు.

అనారోగ్యం.. ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య


లోకేష్(ఫైల్)

తంగళ్లపల్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యం.. ఆర్థిక ఇబ్బందులతో ఓ యువకుడు ఉరివేసుకుని అత్మహత్యకు పాల్పడిన సంఘటన తంగళ్లపల్లి మండల కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు, బంధువులు కథనం ప్రకారం.. తంగళ్లపల్లికి చెందిన ముద్రకోల తిరుపతి-సుశీల దంపతులకు కుమారుడు లోకేష్(26), కూతురు కావ్యలు ఉన్నారు. లోకేష్ ఇంటర్ మీడియెట్ పూర్తి చేశాడు. సోదరి అనారోగ్యం భారినపడగా తల్లిదండ్రులు వైద్యం కోసం అప్పులు చేశారు. కుటుంబానికి చేదోడుగా ఉండాలని భావించి హైదరాబాద్‌లో ప్రైవెట్ ఉద్యోగంలో చేరాడు. ఈ క్రమంలో అనారోగ్యానికి గురై ఉద్యోగం మానేసి స్వగ్రామంలో తల్లిదండ్రుల వద్దకు చేరాడు. అనారోగ్యంతోపాటు అప్పులు, వైద్యం చేయించుకునే పరిస్థితి లేక శనివారం తెల్లవారు జామున ఇంట్లో ఉరి వేసుకుని లోకేష్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బ్లూకోల్ట్స్ పోలీసుల విధులకు ఆటంకం

- ముగ్గురు యువకులపై కేసు

కరీంనగర్ క్రైం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): బ్లూకోల్ట్స్ పోలీసుల విధులకు ఆటంకం కలిగించినందుకు ముగ్గురు యువకులపై కేసు నమోదు చేసినట్లు కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఆరెపల్లికి చెందిన రాకేష్, అచ్యుత్, గుండిగోపాల్‌రావుపేటకు చెందిన ప్రవీణ్ అర్ధరాత్రి సమయంలో గ్రామంలోని దర్గా వద్ద రోడ్డు పక్కన మద్యం తాగుతూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నారు. ఈ క్రమంలో వివరాలు అడిగిన బ్లూకోల్ట్స్ పోలీసులను నెట్టివేసి, ట్యాబ్‌ను లాక్కున్నారు. ఈ ఘటనలో వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

లారీ ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

వెల్గటూర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): వెల్గటూర్ మండల కేంద్రంలో వరంగల్-రాయపట్నం ఏడో నంబరు రాష్ట్ర రహదారిపై శనివారం నడుచుకుంటూ వెళ్తున్న గుర్తు తెలియని వ్యక్తిని వెనుక నుంచి లారీ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం ఏపీ 05 టీజీ 0555 నంబరు గల లారీ అతి వేగంగా ఆ వ్యక్తిని వెనుక వైపు నుంచి ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి.

గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో క్షతగాత్రుడిని జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. కాగా తీవ్ర గాయాలైన వ్యక్తి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. అతనికి సంబంధించిన వివరాలు లభ్యం కాలేదని పోలీసులు తెలిపారు. పోలీసులు లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపిక

హుజూరాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణానికి చెందిన చల్లూరి శ్రీధర్ ఈ నెల 31న హైద్రాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో జరిగే రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 22న జిల్లా కేంద్రంలో జరిగిన యోగా పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. శ్రీధర్ ఎంపిక పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

వస్త్రవ్యాపారులకు కుచ్చుటోపీ

- రూ. రెండు కోట్లతో ఉడాయించిన తమిళనాడు వ్యాపారి


గర్షకుర్తిలో తాళం వేసిన ఉన్న టెక్స్‌టైల్ దుకాణం

గంగాధర, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గర్షకుర్తిలో ఆసాములు తయారు చేసిన వస్త్రాలను ఉద్దెరకు కొనుగోలు చేసి నమ్మించి రెండు కోట్లకు పైగా కుచ్చుటోపి పెట్టిన తమిళనాడు వ్యాపారి మోసం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుల వివరాల ప్రకారం కొన్ని సంవత్సరాలుగా గర్షకుర్తిలో మగ్గాలపై తయారు చేసిన గోచి చీరెలు, తువ్వాలలు, దస్తీలను ఇక్కడి ఆసాములు ఇతర జిల్లాలకు వెళ్లి విక్రయించేవారు. దీన్ని ఆసరాగా చేసుకొని ఎనిమిది నెలల క్రితం తమిళనాడు రాష్ట్రం, క్రిష్ణగిరి జిల్లా పెరుగోపనపల్లికి చెందిన వినోద్‌రాజ్, మరో ముగ్గురు కలిసి హోల్‌సెల్ డీలర్ పేరిట కరీంనగర్ జిల్లా గంగాధర మండలం గర్షకుర్తిలో అద్దె భవనాన్ని తీసుకుని వ్యాపారం ప్రారంభించారు. అయితే గతంలో గర్షకుర్తిలో తయారు చేసిన గోచి చీరలతో పాటు తువ్వాలలు, దస్తీలను ఇతర జిల్లాలకు వెళ్లి అమ్ముకునే ఆసాములు ఇక్కడే హోల్‌సెల్‌గా తమిళనాడుకు చెందిన వ్యాపారులకు అమ్ముకునేవారు. మొదట్లో వస్త్రాలు తీసుకుని డబ్బులు సక్రమంగా ఇచ్చి వ్యాపారులను నమ్మించారు. కొద్దిరోజులకు వీరి వ్యాపారం గర్షకుర్తితో పాటు కొత్తపల్లి, సిరిసిల్ల, కరీంనగర్ చామనపల్లి వరకు చేరింది. వ్యాపారం జోరందుకోగానే అమ్మిన సరుకు సగం డబ్బులు వ్యాపారులకు ఇచ్చి మిగతావి ఇస్తానని దాటవేశాడు. ఇలా ఒక్కొక్కరి వద్ద పది లక్షల రూపాయల నుంచి 15 లక్షల రూపాయల వరకు కొనుగోలు చేసి చీరలు, దస్తీలు, తువ్వాలలతో వారం క్రితం రాత్రికి రాత్రి ఉడాయించారు. సరుకులు తీసుకున్న వ్యాపారికి ఫోన్ చేస్తే స్విచ్‌ఆఫ్ రావడంతో మోసపోయామని గ్రహించిన వ్యాపారులు పోలీసులను ఆశ్రయించారు. సదరు తమిళనాడు వ్యాపారులపై కేసు నమోదు చేసిన గంగాధర ఎస్సై వంశీకృష్ణ విచారణ చేపడుతున్నామని తెలిపారు.

ఎస్‌యూ ఇంజనీరింగ్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

గణేశ్‌నగర్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం గాంధీనగర్ (హుస్నాబాద్)లోని ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరంలో మిగిలిన సీట్ల భర్తీకి ఈ నెల 26వ తేదీన స్పాట్ అడ్మిషన్లు చేపడుతున్నట్లు ప్రిన్సిపాల్ కె తిరుపతిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సీఎస్‌ఈ, ఈసీఈ, సీఎస్‌సీ, సీఎస్‌సీఏఐలో స్పాట్ అడ్మిషన్లు ఉంటాయని పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు కళాశాల మొదటి అంతస్థులో హాజరుకావాలని తెలిపారు. ఇప్పటి వరకు ఎక్కడా అడ్మిషన్ తీసుకోని వారికి అవకాశం ఉంటుందని, వివరాలకు విశ్వవిద్యాలయ వెబ్ సైట్ www.satavahana.ac.inను సందర్శించాలని సూచించారు.

నిజామాబాద్‌లో చోరీ

కోనరావుపేట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం నిజామాబాద్ గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడి నగదును దోచుకెళ్లారు. ఎస్సై ప్రశాంత్‌రెడ్డి కథనం ప్రకారం.. నిజామాబాద్ గ్రామానికి చెందిన ముస్కం లింబాద్రి ఇంటిలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడి 28 వేల రూపాయల నగదు, 17 తులాల వెండిని బీరువా తాళం పగలగొట్టి దోచుకెళ్ళారని బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రశాంత్ రెడ్డి తెలిపారు.

పలు మండలాల్లో పోలీసుల కవాతు

హుజూరాబాద్/జమ్మికుంట/వీణవంక, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్, జమ్మికుంట, వీణవంక మండలంలోని చల్లూరు గ్రామంలో వినాయక చవితి, దేవి నవరాత్రుల ఉత్సవాలల్లో భాగంగా పోలీసుల ఆధ్వర్యంలో శనివారం జవాన్లు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా రాపిడ్ యాంటీ ఫోర్స్ డిప్యూటీ కమాండెంట్ టీపీ భగిల్ మాట్లాడుతూ నవరాత్రుల ఉత్సవాలు ప్రజలు చాలా సంతోషంగా, ఎలాంటి అల్లర్లు జరగకుండా శాంతియుతంగా జరుపుకోవాలని సూచించారు. తెలంగాణలోని పట్టణాల్లో, గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణ ధ్యేయంగా కవాతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామాలు, పట్టణాల్లో శాంతి భద్రతల కోసం రాజకీయ నాయకులు, మాజీ సర్పంచ్‌లు, యువత శాంతియుత మార్గంలో సంరక్షించుకోవాలని సూచించారు. అనంతరం జవాన్లను పలువురు సన్మానించారు. కార్యక్రమంలో సీఐలు కరుణాకర్, రామకృష్ణ, లక్ష్మీనారాయణ, ఎస్‌ఐలు నాగరాజు, తిరుపతి, క్రాంతికుమార్, పోలీస్ సిబ్బంది, జవాన్లు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ఫోన్ అప్పగింత

కరీంనగర్ క్రైం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం తీగలగుట్టపల్లికి చెందిన బుక్క హరీష్ ఈ నెల 5న విద్యారణ్యపురిలో మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నాడు. ఈ మేరకు కరీంనగర్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ టెక్నిలజీతో ఫోన్ గోదావరిఖనిలో ఉన్నట్లుగా గుర్తించిన పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కరీంనగర్ రూరల్ ఠాణాలో శనివారం హరీష్‌కు సీఐ నిరంజన్‌రెడ్డి ఫోన్ అప్పగించారు.

డీజే నిర్వాహకుల బైండోవర్

రామడుగు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): త్వరలో రానున్న గణేష్ ఉత్సవాలను నేపథ్యంలో రామడుగు మండలం పరిధిలోని డీజే సౌండ్ నిర్వహించే వ్యక్తులను ముందస్తు చర్యల్లో భాగంగా తహసీల్దార్ ఎదుట పోలీసులు బైండోవర్ చేశారు. బైండోవర్‌ను అతిక్రమించి డీజే సౌండ్ గణేష్ ఉత్సవాల్లో వాడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రామడుగు ఎస్‌ఐ కె రాజు హెచ్చరించారు.

నాందేడ్ నుంచి తిరుపతి మీదుగా ధర్మవరానికి ప్రత్యేక రైలు

- సెప్టెంబరు 5 నుంచి నడవనున్నరైలు

పెద్దపల్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): తిరుపతి వెళ్లే భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని పెద్దపల్లి జంక్షన్ మీదుగా మరొక ప్రత్యేక వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలును దక్షిణ మధ్య రైల్వే జోన్ నాందేడ్ డివిజన్ రైల్వే అధికారులు నడపనున్నారు. ఈ రైలు వచ్చే నెల 5వ తేదీ నుంచి ప్రతీ వారం నాందేడ్ నుంచి ధర్మవరం వరకు నడుస్తుంది. 07189 నాందేడ్ నుంచి ధర్మవరం ప్రత్యేక వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలు శుక్రవారం నాందేడ్‌లో సాయంత్రం 4:30 నిమిషాలకు బయలుదేరి, బాసర నుంచి 6 గంటలకు, నిజామాబాదు జంక్షన్ 6:25 గంటలకు, జగిత్యాల రాత్రి 8 గంటలకు, కరీంనగర్ రాత్రి 9 గంటలకు, పెద్దపల్లి జంక్షన్‌కు రాత్రి 10:05 గంటలకు, వరంగల్‌కు రాత్రి 11:40 గంటలకు చేరుకుంటుంది. తిరుపతికి శనివారం ఉదయం 11 గంటలకు, పాకాల జంక్షన్, పీలేరు, మదనపల్లి రోడ్డు, కదిరి రైల్వే స్టేషన్ల మీదుగా, ధర్మవరం జంక్షన్‌కు సాయంత్రం 5 గంటలకు చేరుకుంటుంది. ఈ రైలు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో లింగంపేట జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి జంక్షన్, జమ్మికుంట రైల్వే స్టేషన్‌లలో ఆగుతుంది. ఈ రైలు సెప్టెంబర్ 5, 12, 19, 26 తేదీల్లో నడవనున్నది. తిరుగు ప్రయాణంలో ఈ రైలు నంబర్ 07190 ధర్మవరంలో సెప్టెంబర్ 7, 14, 21, 28 తేదీల్లో ప్రతీ ఆదివారం ఉదయం 5:39 గంటలకు ఆరంభమై, ఆ మరుసటి రోజు ఉదయం 7:30 గంటలకు నాందేడ్‌కు చేరుకుంటుంది. పెద్దపల్లి జంక్షన్‌కు సోమవారం మధ్యాహ్నం 12:05 గంటలకు చేరుకుంటుంది.

పాడి ఆవు.. లేగదూడను ఎత్తుకెళ్లిన దుండగులు

శంకరపట్నం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కాచాపూర్ గ్రామానికి చెందిన ఓ రైతు పాడి ఆవు, లేగ దూడను గుర్తు తెలియని దుండగులు శుక్రవారం రాత్రి ఎత్తుకెళ్లారు. బాధిత పాడి రైతు చిలివేరు మధునయ్య రోజు లాగానే సాయంత్రం ఆవు, లేగ దూడను తన పొలం వద్ద మేత వేసి కట్టేసి వచ్చాడు. శనివారం తెల్లవారు జామున వెళ్లి చూసేసరికి ఆవు, లేగ దూడను గుర్తు తెలియని వ్యక్తులు తరలించుకుపోయారని లబోదిబోమన్నాడు. వాటి విలువ సుమారు రూ. 80 వేల వరకు ఉంటుందన్నారు. ఆవు, లేగ దూడ అపహరణపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు బాధిత రైతు తెలిపారు.

అర్బన్ బ్యాంకు ఎన్నికలకు కసరత్తు

- సెప్టెంబరు 30లోగా నిర్వహణకు ఏర్పాట్లు - 9100 ఓట్లతో ఓటరు జాబితా సిద్ధం - కాంగ్రెస్‌లో గ్రూపు రాజకీయాలు

కరీంనగర్ టౌన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ సహకార అర్బన్ బ్యాంకు పాలకవర్గ ఎన్నికల నిర్వహణకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. తాత్కాలిక ప్రస్తుత పాలకవర్గ పదవీకాలం అక్టోబరు 13తో ముగియనున్నందున ఆలోగా ఎన్నికలను నిర్వహించేందుకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నారు. వివిధ కారణాలతో కొన్ని సంవత్సరాలుగా పాలకవర్గ ఎన్నికలు వాయిదా పడడంతో పాలకవర్గాలను ప్రభుత్వం నియమిస్తోంది. పాలకవర్గ ఎన్నికలు నిర్వహించాలంటూ కోర్టు ఆదేశించడంతో అధికారులు, ప్రస్తుత పాలకవర్గ సభ్యుల సహకారంతో ఎన్నికలకు ఏర్పాట్లు చేస్తోంది. బ్యాంకు సభ్యత్వాల్లో అవకతవకలకు పాల్పడ్డారని అధికారుల ప్రాథమిక విచారణతో కోర్టు గత పాలకవర్గంలోని 15 మంది సభ్యుల సభ్యత్వాలను తొలగించాలంటూ ఈ నెల 1న ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఈ నెల 3న నిర్వహించిన పాలకవర్గ సర్వసభ్య సమావేశంలో 15 మంది సభ్యులను శాశ్వతంగా తొలగిస్తున్నట్లు తీర్మానించారు. దీన్ని ఖండించిన ఆనాటి పాలకవర్గ సభ్యులు కోర్టును ఆశ్రయించడంతోపాటు జిల్లా సహకార శాఖ అధికారిని కలిసి సభ్యత్వాల రద్దు విషయమై పలు అభ్యంతరాలను వ్యక్తం చేశారు. తాము అవకతవకలకు పాల్పడలేదని, సంజాయిషీ నోటీసు ఇవ్వకుండా అభిప్రాయాలను స్వీకరించకుండా కొందరు అధికారులు ఇచ్చిన తప్పుడు నివేదికతో సభ్యత్వాలు రద్దు చేయడం సరికాదని పేర్కొన్నారు. అంతేకాకుండా సర్వసభ్య సమావేశం ఎజెండాలో సభ్యత్వాల రద్దు విషయాన్ని చేర్చకపోవడం చట్ట విరుద్ధమని, దీనిపై చర్య తీసుకోవాలని కోరారు. దీంతో జిల్లా సహకార శాఖ అధికారి బ్యాంకు పాలకవర్గం సభ్యుల సభ్యత్వాల రద్దుపై తీసుకున్న నిర్ణయం సరికాదని, మళ్లీ నిర్ణయం తీసుకోవాలంటూ ఇటీవల పాలకవర్గానికి లేఖ పంపించారు. ఈ నేపథ్యంలో గత పాలకవర్గ సభ్యుల సభ్యత్వాల రద్దుపై సస్పెన్షన్ కొనసాగుతోంది.

మరోవైపు ఎన్నికలు నిర్వహించాలంటూ ఇప్పటికే కోర్టు ఆదేశించడం, ప్రస్తుత పాలకవర్గం కూడా ఎన్నికలు నిర్వహిస్తామని కోర్టుకు చెప్పడంతో పాలకవర్గ ఎన్నికలు అనివార్యంగా మారాయి. ఈ నేపథ్యంలో ఎన్నికలను నిర్వహించేందుకు బ్యాంకు అధికారులు సహకార చట్టం నిబంధనల మేరకు ఓటరు లిస్టును సిద్ధం చేసి జిల్లా సహకారశాఖ అధికారికి, ఉన్నతాధికారులకు పంపించినట్లు తెలిసింది. మరోవైపు గత ఓటరు లిస్టును సవరించి 9,100 పైచిలుకు ఓట్లతో ఓటరు జాబితాను సిద్ధం చేశారు. ఈసారి డివిజన్ల వారీగా ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కరీంనగర్, జగిత్యాల బ్రాంచీల్లో ఓటర్లు ఉన్నందున కరీంనగర్‌లో 10 డివిజన్లుగా, జగిత్యాలలో ఒక డివిజన్‌ను ఏర్పాటు చేసి దాదాపు 1,000 ఓట్లతో ఒక్కో డివిజన్ ఉండేలా చర్యలు చేపట్టారు. ఓటరు జాబితాతోపాటు డివిజన్ల వారీగా ఎన్నికలు నిర్వహించేందుకు దాదాపు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని, ప్రభుత్వం అనుమతి ఇచ్చిన వెంటనే ఎన్నికలను నిర్వహిస్తామని అధికారులు, ప్రస్తుత పాలకవర్గ చైర్మన్ తెలిపారు.

మరోవైపు కాంగ్రెస్‌కు చెందిన ప్రస్తుత పాలకవర్గంతోపాటు మాజీ పాలకవర్గ సభ్యులు ఎన్నికల్లో అమీతుమీ తేల్చుకునేందుకు సిద్ధమవుతున్నారు. కాంగ్రెస్‌కు చెందిన రెండు గ్రూపులు విమర్శలు గుప్పించుకుంటూ అర్బన్ బ్యాంకు రాజకీయాలను రసవత్తరంగా మార్చుతుండగా బీజేపీ, బీఆర్‌ఎస్ ఇతర పార్టీలు పెద్దగా ఆసక్తి చూపినట్లు కనిపించడం లేదు.

బడికి తాళం వేసి తల్లిదండ్రుల నిరసన


తాళం వేసి నిరసన తెలుపుతున్న తల్లిదండ్రులు

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యో తి): పాఠాలు చెప్పేందుకు పాఠశాలలో ఒక్కరే ఉపాధ్యాయుడు ఉండడం వల్ల తమ పిల్లలు నష్టపోతున్నారని, మరో ఉపాధ్యాయుడిని కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఎల్లారెడ్డిపేట మండలం కిష్టునాయక్‌తండాలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధాన గేటుకు శనివారం తాళం వేసి తల్లిదండ్రులు విద్యార్థులతో కలిసి నిరసనకు దిగారు. బడిలో మొత్తం 28 మంది విద్యార్థులుండగా ఇద్దరు ఉపాధ్యాయులు విధులు నిర్వహించేవారని పేర్కొన్నారు. ఇటీవల ఓ ఉపాధ్యాయినిని విద్యా శాఖ అధికారులు డిప్యూటేషన్‌పై వేరే మండలానికి పంపించారని చెప్పారు. ఒక్కరే ఉపాధ్యాయుడు అన్ని తరగతులకు ఎలా బోధిస్తారని ప్రశ్నించారు. సుమారు గంటపాటు ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న విద్యాశాఖ అధికారులు స్థానిక మాజీ ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులతో సెల్‌ఫోనులో మాట్లాడి ఉపాధ్యాయుడిని కేటాయించేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు.

కోర్టును ఆశ్రయించిన అదనపు కమిషనర్ సువార్త

కరీంనగర్ టౌన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ జె సువార్త హైకోర్టును ఆశ్రయించారు. విధులు సక్రమంగా నిర్వర్తించడం లేదని ఆమెపై అసంతృప్తితో ఇటీవల మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ సీడీఎంఏకు సరెండర్ చేశారు. అయితే ఆమె సీడీఎంఏకు వెళ్లకుండా యధావిధిగా రెండు రోజుల పాటు కార్యాలయానికి వచ్చి తన ఛాంబర్‌లో కూర్చున్నారు. విషయం తెలుసుకున్న కమిషనర్ శుక్రవారం ఆమెకు కేటా యించిన విధులను ఇతర అధికారులకు అప్పగిస్తూ సర్క్యులర్ జారీ చేశారు. ఆమె వద్ద నుంచి రికార్డులను స్వాధీనం చేసుకోవాలని, ఛాంబర్ ఖాళీ చేయించాలని ఆదేశించారు. దీంతో అధికారులు ఆమె ఛాంబర్ తాళం పగులగొట్టి రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. దీనిపై అసంతృప్తిగా ఉన్న ఆమె హైకోర్టును ఆశ్రయించి న్యాయం చేయాలని కోరగా హైకోర్టు స్పందిస్తూ స్టేటస్‌కో మెయింటేన్ చేయాలని, తదుపరి విచారణ అక్టోబరు 8వ తేదీకి వాయిదా వేస్తూ ఉత్తర్వులిచ్చింది.

రోడ్డు బాగుచేయాలని విద్యార్థుల రాస్తారోకో

ఇల్లంతకుంట, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి) గుంతల రోడ్డుపై వెళ్లలేమంటూ విద్యార్థులు రాస్తారోకో చేపట్టారు. మండలంలోని రహీంఖాన్‌పేట గ్రామంలోని ఆదర్శ పాఠశాలకు వివిధ గ్రామాల నుంచి విద్యార్థులు ప్రతిరోజు ఆటోల్లో వస్తుంటారు. అనంతారం, రహీంఖాన్‌పేట, వెల్జిపూర్, ఒగులాపూర్ తదితర గ్రామాల రోడ్లు పూర్తిగా చెడిపోయాని పేర్కొంటు శనివారం పాఠశాల విద్యార్థులు నిరసన తెలిపారు. విద్యార్థులకు ఏబీవీపీ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా రాష్ట్ర నాయకుడు అక్కెం నాగరాజు మాట్లాడుతు మండలంలోని రోడ్లు పూర్తిగా చెడిపోయాయని చిన్నవర్షాలకే పొలాలను తలపిస్తున్నాయని పేర్కొన్నారు. పాఠశాలకు వచ్చే విద్యార్థులు సమయానికి రాలేకపోతున్నారని పేర్కొన్నారు.

రోడ్లు బాగుచేయాలని అనేకసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల రాస్తారోకోతో వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకపోతామని నచ్చజెప్పడంతో విద్యార్థులు నిరసన విరమించారు.


రహీంఖాన్‌పేటలో రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు

వ్యవసాయ క్షేత్రంలో నిఘా నేత్రం

- సోలార్ సిస్టంతో సీసీ కెమెరా ఏర్పాటు

ఎండపల్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మోటర్లు చోరీకి గురి కాకుండా ఎండపల్లి మండలం మారేడుపల్లి గ్రామానికి చెందిన తనుగుల సతీష్ అనే యువ రైతు తన వ్యవసాయ క్షేత్రంలో సీసీ కెమెరా ఏర్పాటు చేసుకున్నాడు. ఈ సీసీ కెమెరా విద్యుత్‌తో సంబంధం లేకుండా సోలార్‌సిస్టంతో పనిచేస్తుంది. దీని కోసం రైతు ఎనిమిది వేల రూపాయలు ఖర్చు చేశాడు. పొలంలో సీసీ కెమెరాల ఏర్పాటుతో దొంగల నుంచి, అడవి పందుల నుంచి పంట ఉత్పత్తులను కాపాడుకోవచ్చని రైతు సతీష్ తెలిపాడు.



రోస్టర్ విధానంలో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయులకు అన్యాయం

ఇల్లంతకుంట, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి) రోస్టర్ విధానంలో ఎస్సీఎస్టీ ఉపాధ్యాయులకు అన్యాయం జరుగుతుందని పేర్కొంటు డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ నికోలస్‌కు బహుజన టీచర్స్‌ఫెడరేషన్ నాయకులు వినతిపత్రం ఇచ్చారు. హైద్రాబాద్‌లో శనివారం కలిసి సమస్యలు విన్నవించారు. ఉపాధ్యాయుల పదోన్నతులలో ప్రస్తుతం అనుసరిస్తున్న విధానం సరిగా లేదన్నారు. పాఠశాలల పర్యవేక్షణకు జిల్లాస్థాయిలో సబ్జెక్ట్ నిపుణులను నియమించాలని, అప్పుడే మెరుగైన ఫలితాలు సాధించే అవకాశం ఉందన్నారు, అనంతరం సన్మానించారు. కార్యక్రమంలో బీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము రమేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎలా కిషన్, సంఘనాయకులు జాడి రాజన్న, జాదవ్ వెంకట్రావునాయక్, విజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.



వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయ సంఘ నాయకులు

టెక్స్‌టైల్ పార్క్ సమ్మె ఉద్ధృతం

- ఐదు రోజులుగా సమ్మెలో కార్మికులు
- వంటావార్పుతో వినూత్న నిరసన..
- యజమానులతో చర్చలు విఫలం



ప్రధాన ద్వారం ఎదుట కార్మికులు వంటావార్పు



టెక్స్‌టైల్ పార్కు ప్రధాన ద్వారం

తంగళ్లపల్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యల సాధన కోసం టెక్స్‌టైల్ పార్కు పవర్ లూం కార్మికులు సమ్మె ఉధృతం చేశారు. ఐదు రోజులుగా కార్మికులు సమ్మెబాట పట్టి ఆందోళన చేస్తున్నారు. దీంట్లో భాగంగా శనివారం తంగళ్లపల్లి మండలం బద్దనపల్లి టెక్స్‌టైల్ పార్కు ప్రధాన ద్వారం ముందు కార్మికులు వంటావార్పుతో నిరసన వ్యక్తం చేశారు. కొద్ది రోజులుగా టెక్స్‌టైల్ పార్కు కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని ఆందోళన చేస్తున్నారు. గతంలో యజమానులు, చేనేత జౌళి శాఖ అధికారులకు కూలి పెంపు తదితర సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రాలు సమర్పించారు. యజమానులు, అధికారులు పట్టించుకోకపోవడంతో ఒక్కరోజు సమ్మె చేశారు. అయినా యజమానులు, అధికారుల నుంచి స్పందన లేకపోవడంతో నిరవధిక సమ్మెకు దిగుతామని ప్రకటించారు. కార్మికుల సమ్మె నోటీస్‌ను అధికారులు, యజమానులు పట్టించుకోకపోవడంతో ఈనెల 19వ తేది నుంచి కార్మికులు నిరవధిక సమ్మెకు దిగారు.

● ప్రధానంగా డిమాండ్లు..

కార్మికులు ప్రధానంగా మూడు డిమాండ్లతో సమ్మె బాట పట్టారు. టెక్స్‌టైల్ పార్కులో ప్రభుత్వ ఆర్డర్ వస్త్రాలకు సంబంధించి కార్మికులకు రోజుకు రూ.1000 వేతనం వచ్చే విధంగా కూలి నిర్ణయించి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే ప్రైవేట్ వస్త్రాలకు 10 పిక్కులకు 50 పైసలు కూలీ పెంచి అందివ్వాలని, కార్మికులకు ప్రతి సంవత్సరం 15 రోజుల వేతనం బోనస్‌గా అందించాలనే డిమాండ్లతో సమ్మె బాట పట్టారు.

● చర్చలు విఫలం..

కూలీ పెంపు విషయంపై నిన్న అధికారులతో జరిగిన చర్చలు.. నేడు యజమానులతో జరిగిన చర్చలు విఫలమయ్యాయి. కార్మికుల సమ్మెబాట పట్టడంతో చేనేత జౌళి శాఖ అధికారులు శుక్రవారం కార్మికులతో చర్చలు జరిపారు. ముందుగా సమ్మె విరమించాలని వారం రోజుల్లో కూలి పెంచే విధంగా చర్యలు తీసుకుంటామని అధికారులు చెప్పడాన్ని తిరస్కరించి సమ్మె కొనసాగించారు. కార్మికులు, యజమానులను సమన్వయం చేసి శనివారం చర్చలు జరిపించింది. అధికారులు వారం రోజులు గడువు అడిగిన విధంగానే యజమానులు సైతం అదే విధంగా ముందుగా సమ్మె విరమిస్తే వారం రోజుల్లోగా కూలి పెంపు విషయంపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. దీంతో కార్మిక సంఘ నాయకులు, కార్మికులు సమ్మె విరమించేది లేదని ముందుగా కూలీ పెంపుపై హామీ ఇస్తేనే సమ్మె విరమిస్తామని తేల్చి చెప్పారు. రెండు రోజుల్లో రెండుసార్లు జరిగిన చర్చలు విఫలమయ్యాయి.



యజమానులతో చర్చలు జరుపతున్న కార్మికులు

● ఐదు రోజులుగా సమ్మె.

కార్మికులు ఐదు రోజులుగా సమ్మె బాట పట్టి నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. ఈనెల 19, 20వ తేదిన టెక్స్‌టైల్ పార్కులో ర్యాలీ నిర్వహించి ప్రధాన ద్వారం వద్ద ధర్నా నిర్వహించారు. 21వ తేదిన జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించి నేతన్న విగ్రహానికి వినతిపత్రం అందించి నిరసన వ్యక్తం చేశారు. ఈ నెల 22వ తేదిన ఏడీ కార్యాలయం ఎదుట ధర్నా చేసి అధికారులకు వినతి పత్రం సమర్పించారు. శనివారం టెక్స్‌టైల్ ప్రధాన ద్వారం ఎదుట వంటావార్పు కార్యక్రమం నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. కార్మికులకు మద్దతుగా సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్రఅధ్యక్షుడు మూషం రమేశ్, జిల్లా అధ్యక్షులుకోడంరమణలుఆందోళనలో పాల్గొన్నారు.

కార్మికులు శ్రమ దోపిడీకి గురవుతున్నారు..

- కోడం రమణ, తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు



టెక్స్‌టైల్ పార్కులో కార్మికులు శ్రమ దోపిడీకి గురవుతున్నారు. ప్రభుత్వ స్పందించి కార్మికులకు కూలి పెంచి న్యాయం చేయాలి. కార్మికుల ఉపాధి కోసం ప్రభుత్వం ఆర్డర్లు ఇస్తోంది. దానికి అనుగుణంగా కార్మికులకు కనీసం రోజుకు రూ.1000 వేతనం అందే విధంగా చర్యలు తీసుకోవాలి. ప్రైవేట్ వస్త్రానికి 10 పిక్కులకు కనీసం 50పైసలు పెంచాలి. అధికారులు, పాలకులు తక్షణమే చర్యలు చేపట్టాలి.

కూలి పెంచాలి..

- ఆకుబత్తిని శ్రీకాంత్, టెక్స్‌టైల్ పార్కు కార్మికుడు



కూలి ఒప్పందం ముగిసి ఏళ్లు గడుస్తున్నా ఇప్పటివరకు కూలి పెంపు ఊసే ఎత్తడంలేదు. ధరలకు అనుగుణంగా కూలి పెంచాలి. అధికారులు స్పందించి కూలి పెంచే విధంగా చర్యలు తీసుకోవాలి. నిత్యావసర ధరలు ఆకాశాన్ని అంటుతుండగా కూలి మాత్రం పెరగడం లేదు.

కార్మికులతో చర్చలు జరుపుతున్నాం..

-రాఘవరావు, ఏడీ టెక్స్‌టైల్ పార్కు

సమ్మె విరమణకు కార్మికులతో చర్చలు జరుపుతున్నాం. రెండుసార్లు జరపగా విఫలమయ్యాయి. శనివారం యజమానులు, కార్మికులను సమన్వయం చేసి చర్చలు జరిపించాం. సానుకులంగా చర్చలు జరిగినప్పటికి చివరికి విఫలయ్యాయి. కార్మికుల పట్ల ప్రభుత్వం సానుకూలంగా ఉంది. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. త్వరలో సమస్యకు పరిష్కారం దొరుకుతుంది.

తండ్రి ఏఎస్ఐ.. కొడుకు ఎస్ఐ

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లాలోని బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐగా రాజయ్య విధులు నిర్వహిస్తున్నారు. గంభీరావుపేట ఎస్ఐగా పనిచేస్తున్న రాజయ్య తనయుడు రమాకాంత్ ఎస్ఐగా శనివారం బదిలీపై బోయినపల్లికి వచ్చారు. ఉమ్మడి జిల్లాలోని మానకొండూరు మండలం వేగురుపల్లికి చెందిన రమాకాంత్ 2018లో ఎస్ఐగా ఎంపికయ్యారు. తండ్రి విధులు నిర్వహిస్తున్న పోలీస్ స్టేషన్‌కే తనయుడు ఎస్ఐగా రావడంతో వారిలో ఆనందం వెల్లివిరుస్తోంది.

ఎమ్మెల్యే కవ్వంపల్లికి పరామర్శ



ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను పరామర్శిస్తున్న మంత్రి వివేక్ వెంకటస్వామి

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణను, కుటుంబ సభ్యులను రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి శనివారం పరామర్శించారు. ఎమ్మెల్యే సోదరుడు కవ్వంపల్లి రాజేశం ఇటీవల అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న మంత్రి వివేక్ వెంకటస్వామి కరీంనగర్‌లో ఎమ్మెల్యేను కలిశారు. బెజ్జంకి మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కొమ్మెర రవీందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ



కొండగట్టులో క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

వేములవాడ కల్చరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. శ్రావణ మాసం చివరి రోజు అమావాస్య సందర్భంగా భక్తులు ఆలయానికి తరలివచ్చారు. రాజరాజేశ్వరస్వామి వారి ఆలయానికి చేరుకున్న భక్తులు రాజన్నను దర్శించుకుని తరించారు. రాజన్నకు ఎంతో ఇష్టమైన కోడెమొక్కులు చెల్లించుకున్నారు. కాగా ఈనెల 27వ తేదిన రాజన్న ఆలయంలోని నాగిరెడ్డి మండపంలో వినాయక విగ్రహాన్ని నిలిపేందుకు ఆలయాధికారులు ఏర్పాట్లు చేశారు.

అంజన్న సన్నిధిలో..

మల్యాల: మండలంలోని కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధానం శనివారం భక్తులతో సందడిగా మారింది. వేలాదిగా భక్తులు అంజన్న సన్నిధికి వచ్చి స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేకాలు ఇతరాత్ర పూజలు నిర్వహించి బేతాళుడు, రాములవారిని కూడా దర్శించుకున్నారు. స్వామి వారికి ఆలయ అర్చకులు చందనాభిషేకం, నిత్య పూజలు జరిపారు.

● ధర్మపురి క్షేత్రంలో..

ధర్మపురి: ధర్మపురి క్షేత్రంలో శనివారం భక్తుల రద్దీ పెరిగింది. స్థానిక లక్ష్మీనరసింహ స్వామి అనుబంధ ఆలయాల్లో ఉదయం ఆలయ వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు భక్తులు గోదావరి నదిలో స్నానాలు ఆచరించి ఆలయాలకు చేరుకుని అభిషేకం, అర్చన, హోమం, నిత్య కల్యాణం చేయించారు. స్వామి వారలను దర్శనం చేసుకున్నారు. ఆలయం పక్షాన ఈవో సంకటాల శ్రీనివాస్, ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్ ఆధ్వర్యంలో సిబ్బంది భక్తులకు తగు సేవలు అందించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, వేదపండితులు, అర్చకులు పాల్గొన్నారు.



రాజన్న దర్శనం కోసం క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు

మైనార్టీ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు

తిమ్మాపూర్/కరీంనగర్ రూరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ ఇనిస్టిట్యూషన్స్ సొసైటీ ఆధ్వర్యంలో నడుస్తున్న తెలంగాణ మైనార్టీస్ గురుకుల కళాశాల(బాలుర), కరీంనగర్ విట్స్ క్యాంపస్, రేకుర్తిలో గల తెలంగాణ మైనార్టీస్ గురుకుల కళాశాల (బాలికల)లో ఈ విద్య సంవత్సరం 2025-2026 నుంచి ఐఐటీ, నీట్ కోర్సులకు ఉచిత శిక్షణతో ప్రత్యేక తరగతులు ప్రారం భం అవుతున్నాయని మైనార్టీ గురుకులాల సమన్వయకర్త కె సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన మైనార్టీస్(ముస్లిం, జైనులు, బుద్ధులు, సిక్కులు, పార్సీలు) నాన్ మైనార్టీస్(ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓబీసీ)ల నుంచి ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. దరఖాస్తులు 26వ తేదీ లోపు సమర్పించాలని, ఈ నెల 29న ప్రవేశపరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు విట్స్ క్యాంపస్‌లోని ఆర్ఎల్‌సీ కార్యాల యంలో, ఇతర వివరాలకు 7331170869, 7331170843, 7033117844 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

అంబేద్కర్ ఓపెన్ డిగ్రీ ప్రవేశాల గడువు పొడిగింపు

గణేశ్‌నగర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం 2025-26 విద్యా సంవత్సరానికి ఓపెన్ డిగ్రీ మొదటి సంవత్సరం అడ్మిషన్లకు ఈనెల 30 వ తేదీ వరకు గడువు ఉందని ప్రభుత్వ మహిళల డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వరలక్ష్మి, కోఆర్డినేటర్ డాక్టర్ మనోజ్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఇంటర్మీడియట్ ఓపెన్ స్కూల్, ఐటీఐ, డిప్లొమా విద్యార్థులు టీఎస్ ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసి రశీదు పొందాలని సూచించారు. ఇతర సమాచారం కోసం 7382929755 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఒక్క ఎకరాలకు అదనంగా నీరిచ్చినా ముక్కుకు నేలకు రాస్తా..

- బీఆర్‌ఎస్ నాయకులకు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సవాల్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ హయాంలో చొప్పదండి నియోజకర్గానికి ఒక్క ఎకరానికి అదనంగా నీరిచ్చినట్టు నిరూపిస్తే తన ముక్కు నేలకు రాస్తానని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం బీఆర్ఎస్ నాయకులకు సవాలు విసిరారు. శనివారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథిగృహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించే జనహిత పాదయాత్రతో ఉమ్మడి జిల్లాలో బీఆర్ఎస్ పీఠం కదులుతుందన్నారు. గంగాధర మండలంలో జన సునామి రాబోతోందన్నారు. పదేళ్లలో పేదలకు బీఆర్ఎస్ ఒక్క ఇంటినీ నిర్మించి ఇవ్వలేదని, ఇప్పుడు నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు చేశామని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఒక్క రేషన్‌కార్డు ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వంలో దరఖాస్తు చేసుకున్నవారందరికీ అందిస్తున్నామని అన్నారు. చొప్పదండి నియోజకవర్గంలో పదేళ్లలో ఒక్కపనీ చేయలేదన్నారు. నియోజకవర్గానికి నీరివ్వకుండా ఎండబెట్టి గాయత్రి పంపుహౌస్ ద్వారా సిరిసిల్ల, గజ్వేల్ నియోజకవర్గాల్లో పారించు కున్నారని విమర్శించారు. నియోజకర్గంలో అదనంగా ఒక్క ఎకరాకు నీరిచ్చినట్టు నిరూపించినా ముక్కుకు నేలకు రాస్తానని ఎమ్మెల్యే సవాలు విసిరారు. బీఆర్ఎస్‌కు చెందిన నలుగురు చిల్లరగాళ్లకు డబ్బులు ఇచ్చి న్యూసెన్స్ చేయాలని చూస్తున్నారని, నాలుక చీరేస్తామని హెచ్చరించారు. కేసీఆర్ కొండగట్టుకు రెండుసార్లు వచ్చి రూ.500 కోట్లు ఇస్తామన్నారని, ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని అన్నారు. నియోజకవర్గానికి ఒక్క ప్రాజెక్టు, పరిశ్రమ, విద్యాసంస్థకానీ తీసుకురాలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఆధ్వర్యంలో త్వరలోనే గంగాధరలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామని తెలిపారు. రానున్న రోజుల్లో చొప్పదండి నియోజకవర్గాన్ని రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దుతామని చెప్పారు. జనహిత పాదయాత్రలో అన్నివర్గాలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో ఎరువులపై మూడు జిల్లాల కలెక్టర్లతో మాట్లాడుతూ ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేస్తున్నామని, కొందరు కావాలని కృత్రిమ కొరత సృష్టించే యత్నం చేస్తున్నారని విమర్శించారు. నారాయణపూర్ ప్రాజెక్టు భూసేకరణకు త్వరలోనే రూ.43 కోట్లు మంజూరవుతాయన్నారు. గంగాధర మండలం ఉప్పర మల్యాల నుంచి కురిక్యాల ద్వారా మధురానగర్ ఎక్స్ రోడ్ వరకు పాదయాత్ర సాగుతుందని, అక్కడే సభ ఉంటుందని తెలిపారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, డిప్యూటీ సీఎం మల్లు బట్టి విక్రమార్క, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, కార్పొరేషన్ చైర్మన్‌లు హాజరుకానున్నట్లు చెప్పారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ సత్తు మల్లేశం, ఆర్టీఏ సభ్యుడు పడాల రాహుల్, టీపీసీసీ నాయకులు రుద్ర సంతోష్, రహమత్ హుస్సేన్, కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, వైద్యుల అంజన్‌కుమార్, పులి అంజనేయులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ నిర్వాసితుల త్యాగం మరువలేనిది

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయం నుంచి మూలవాగు బ్రిడ్జి వరకు రోడ్డు విస్తరణలో భూములు, ఇళ్లు కోల్పోయిన నిర్వాసితుల త్యాగం ఎప్పటికీ మరువలేనిదని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యలయంలో శనివారం కాంగ్రెస్ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూలవాగు నుంచి రాజన్న ఆలయం వరకు రోడ్డు నిర్మాణ పనులకు ఆదివారం శంకుస్థాపన చేపట్టనున్నామని తెలిపారు. పట్టణాన్ని టెంపుల్ సిటీగా అభివృద్ధి చేస్తామన్నారు. అభివృద్ధిలో అందరు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంద్రగిరి శ్రీనివాస్, సాగరం వెంకటస్వామి, కనికరపు రాకేష్, పుల్కం రాజు, కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

గోదావరిలోకి కొనసాగుతున్న నీటి విడుదల

- ఎస్సారెస్పీ 16 గేట్ల నుంచి ...

49,280 క్యూసెక్కులు దిగువకు







గేట్ల ద్వారా దిగువకు ఉరకలేస్తున్న శ్రీరాంసాగర్ నీరు, గాయత్రి పంపుహౌస్ నుంచి విడుదలవుతున్న నీరు, ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి విడుదల అవుతున్న నీరు

జగిత్యాల, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి వరద గేట్ల ద్వారా గోదావరిలోకి నీటి విడుదల శనివారం కొనసాగింది. ఎగువ ప్రాంతం నుంచి వరద నీరు ఎక్కువగా వస్తుండడంతో 16 గేట్ల ద్వారా 49,280 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదులుతున్నారు. కాగా ఎస్సారెస్పీలోకి 75 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 79.263 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వరద గేట్లు పైకి ఎత్తడం, కాకతీయ కాలువ, మిషన్ భగీరథ, వరద కాలువ, ఇతరాలకు కలిపి ప్రాజెక్టు నుంచి 78,812 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఇందులో వరద కాలువకు 20,000 క్యూసెక్కులు, కాకతీయ కాలువకు 3,500 క్యూసెక్కులు వదులుతున్నారు.

శ్రీపాద ఎల్లంపల్లికి కొనసాగుతున్న వరద

అంతర్గాం: జిల్లాలో గల శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు వరద కొనసాగుతున్నది. శుక్రవారం సాయంత్రం వరకు వరద తగ్గుముఖం పట్టడంతో గేట్లు మూసేసిన అధికారులు వరద పెరగడంతో మళ్లీ శనివారం గేట్లు తెరిచారు. ఎగువ ప్రాంతం నుంచి 86,775 క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా, గోదావరిలోకి 10 గేట్ల, ద్వారా 80200 క్యూసెక్కుల నీటిని వదిలి పెడుతున్నారు. నంది పంప్‌హౌస్‌కు 6300 క్యూసెక్కుల నీటిని తరలిస్తుండగా, అక్కడి నుంచి గాయత్రి పంప్‌హౌస్ ద్వారా మిడ్ మానేరులోకి 6,300 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, 19.730 టీఎంసీల నీళ్లు ఉన్నాయి.

గాయత్రి పంపుహౌస్ నుంచి..

రామడుగు: రామడుగు మండలం గాయత్రి లక్ష్మీపూర్ గాయత్రి పంపుహౌస్ నుంచి నీటి విడుదల కొనసాగుతుంది. ప్రస్తుతం రెండు పంపుల ద్వారా 6,300 క్యూసెక్కుల నీటిని అధికారులు గ్రావిటీ కెనాల్ ద్వారా విడుదల చేశారు. అది నేరుగా వెళ్లి వరద కాలువలో కలుస్తుంది. ఎస్సారెస్పీ నుంచి 16,000 క్యూసెక్కుల నీరు వరద కాలువ 99 కిలోమీటర్ల వద్ద కలుస్తున్నాయి. దీంతో ప్రస్తుతం వరద కాలువకు 22,600 క్యూసెక్కుల నీరు చేరుతున్నది. మిడ్ మానేరుకు 22,600 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు.

మిడ్ మానేరుకు కొనసాగుతున్న ఇన్ ఫ్లో

బోయినపల్లి: శ్రీరాజరాజేశ్వర జలాశయానికి ఎస్సారెస్పీ, ఎల్లంపల్లి ద్వారా నీటి ప్రవాహం కొనసాగు తోంది. ప్రాజెక్టులోకి శనివారం సాయంత్రం వరకు 21,368 క్యూసెక్కుల ఇన్ ఫ్లో కొనసాగుతుంది. ఇందులో ఎస్సారెస్పీ నుంచి వరద కాలువ ద్వారా 15,068, గాయత్రి పంప్‌హౌస్ నుంచి 6,300 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుంది. మిడ్ మానేరు ప్రాజెక్టు నుంచి ప్యాకేజి 10లోని అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 9600, ఎల్ఎండీ ప్రాజెక్టుకు నాలుగు గేట్లను మీటరుపై కెత్తి 8,018 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 318 మీటర్లకు గాను ప్రస్తుతం 313.79 నీటినిల్వ సామర్థ్యం 27.55 టీఎంసీలకు గాను 17.936 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి..


ఇల్లంతకుంట: ఇల్లంతకుంట మండలం అనంతగిరి గ్రామసమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి మూడు పంపుల ద్వారా నీటిని ఎత్తిపోస్తున్నారు. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 1.31 టీఎంసీలకు చేరుకుంది. మధ్యమానేరు ద్వారా 9600 క్యూసెక్కుల నీరు వస్తుండగా, ఎగువన ఉన్న 11వ ప్యాకేజీలోని రంగనాయకసాగర్‌కు 6600 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

ఎనిమిది టీఎంసీలకు చేరిన దిగువ మానేరు

తిమ్మాపూర్: కరీంనగర్ పరిధిలోని ఎల్ఎండీ రిజర్వాయర్ నీటి మట్టం ఎనిమిది టీఎంసీలకు చేరుకుంది. ఎగువన ఉన్న శ్రీరాజరాజేశ్వర రిజర్వాయర్ (మధ్య మానేరు) రిజర్వాయర్ నుంచి నాలుగు గేట్లు ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. ఎగువ నుంచి క్యూసెక్కుల నీరు మొత్తం 12,262 క్యూసెక్కుల నీరు ఎల్ఎండీలోకి ఇన్‌ఫ్లో వస్తోంది. ఎల్ఎండీ పూర్తి స్థాయి నీటిమట్టం 24.034 టీఎంసీలు కాగా ప్రస్తుతం 8.261 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

ఉధృతంగా వరద కాలువ

గంగాధర: వరద కాలువలో శ్రీరాంసాగర్ నీరు ప్రమాదకరంగా ఉధృతంగా ప్రవహిస్తోంది. పదిహేనేళ్లలో ఎన్నడు ఇంతటి వరద ప్రవాహం చూడలేదని రైతులు అంటున్నారు. గంగాధర మండలంలోని ర్యాలపల్లి, కొండయ్యపల్లి, నాగిరెడ్డిపూర్, కొండన్నపల్లి, తాడిజెర్రి, రంగరావుపల్లి, గర్షకుర్తి, గట్టుబూత్కూర్, ఆచంపల్లి గ్రామాలకు చెందిన రైతుల వ్యవసాయ పంపు మోటార్లు, స్టార్టర్లు వరద ఉధృతికి కొట్టుకుపోయినట్లు తెలిపారు. అధికారులు ఇంతపెద్ద ఎత్తున నీరు విడుదల చేస్తున్నట్లు కనీస సమాచారం అందించలేదని రైతులు వాపోతున్నారు. ఇక లక్ష్మీపూర్ గాయత్రీ పంపుల్లో రెండు మోటర్ల ద్వారా ఆరు వేలు, శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి 19,000 క్యూసెక్కులు మొత్తం 25,000 క్యూసెక్కుల నీరును వరద కాలువ నుంచి మిడ్ మానేరుకు తరలిస్తున్నారు. నాగిరెడ్డిపూర్ గేట్ల వద్ద నీటిపారుదల శాఖ ఎస్ఈ రమేష్, డీఈ రూప్లా నాయక్, ఏఈ రఘురాంలు వరద కాలువ నీటిని శనివారం పర్యవేక్షించారు.



ఎల్ఎండీలో ఉన్న నిల్వ ఉన్న నీరు

అన్నదాతల తండ్లాట..

(5వ పేజీ తరువాయి)

మెట్రిక్ టన్నులు. ఎల్లారెడ్డిపేటకు 2400మెట్రిక్ టన్నులు, బోయి నపల్లికి 2500 మెట్రిక్ టన్నులు, చందుర్తికి 2180మెట్రిక్ టన్నులు, కోనరావుపేటకు 2400 మెట్రిక్ టన్నులు, రుద్రంగికి 1120 మెట్రిక్ టన్నులు, వేములవాడకు 920 మెట్రిక్ టన్నులు, వేములవాడ రూరల్ 1560 మెట్రిక్ టన్నులు అవసరం ఉంటుందని అంచనావేశారు. జిల్లాకు ఇప్పటివరకు యూరియా 13217మెట్రిక్ లు టన్నులు వచ్చింది. జిల్లాకు ఇంకా 12153 మెట్రిక్ టన్నులు రావాల్సిఉంది.

జిల్లాలో 2.43 లక్షల ఎకరాలు వానాకాలం సాగు

రాజన్న సిరిసిల్ల జిల్లాలో వానకాలం సీజన్లో 2,43,773 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తారని వ్యవసాయశాఖ అంచనా వేసింది. వరి 1,84,860ఎకరాలు, పత్తి 49,760 ఎకరాలు, మొక్కజొన్న 1600 ఎకరాలు, కంది 1155 ఎకరాలు, పెసర 79 ఎకరాల్లో సాగు చేస్తారని అంచనాలు వేశారు. వ్యవసాయ శాఖ అంచనాలకు అనుగుణంగానే జిల్లాలో ఇప్పటివరకు 2,35,330 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారు. ఇందులో వరి 1,84,310 ఎకరాలు, పత్తి 46,485 ఎకరాలు, మొక్కజొన్న 3748ఎకరాలు, పెసర 30ఎకరాలు, కంది 660 ఎకరాలు ప్రధానంగా సాగు చేశారు. సాగుపనులు చివరికి చేరుకున్న దశలో రైతులను యూరియా కొరత రైతులను ఇబ్బందికి గురిచేస్తోంది.

జనహిత పాదయాత్రను విజయవంతం చేయాలి

బోయినపల్లి ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : చొప్పదండి నియోజకవర్గంలో ఆదివారం నిర్వహించే జనహిత కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు భీమ్‌రెడ్డి మహేశ్వర్‌రెడ్డి కోరారు. బోయినపల్లిలో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆధ్వర్యంలో చొప్పదండి నియోజకవర్గంలోని గంగాధర మండల ఉప్పరమల్యాల నుంచి మధురానగర్ వరకు జరహిత పాదయాత్ర కొనసాగుతుందన్నారు. అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. మాజీ ఎంపీటీసీ పిట్టల రమేష్, నాయకులు కొప్పుల నగేష్, ద్యావ మహిపాల్ రెడ్డి, నల్లమోహన్, బోయిని పరుశురాం,తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నిర్మూలనకు కట్టుదిట్టమైన చర్యలు

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

సిరిసిల్ల కలెక్టరేట్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : మాదక ద్రవ్యాల నిర్మూలనకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం మదక ద్రవ్యాలు,డ్రగ్స్ నియంత్రణ కోసం చేపట్టాల్సిన చర్యలపై ఎస్పీ మహేష్ బిగీతేతో కలిసి సంబంధిత అధికారులతో జిల్లాస్థాయి నార్కోటిక్ కంట్రోల్ సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో నమోదవుతున్న ఎన్‌డీపీఎస్ కేసులు, గంజాయి సాగు నివారణ చర్యలు,మాదక ద్రవ్యాల వాడకం నియంత్రణ చర్యలు, మాదక ద్రవ్యాల నివారణ కోసం శాఖల వారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే నష్టాల గురించి చేయాల్సిన విస్తృత ప్రచారం వంటి పలుఅంశాలపై చర్చించారు. కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా మాట్లాడుతూ జిల్లాలో ఉన్న కస్తూర్బాగాంధీ విద్యాలయాలు, మోడల్ పాఠశాలలు, వసతిగృహాలు, గురుకుల కళాశాలలు, పాఠశాలలల్లో డ్రగ్స్ , మాదక ద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై వైద్యఅధికారులతో విద్యార్థులకు అవగహన కార్యక్రమాలను నిర్వహించాలని తీసుకున్న నిర్ణయం ప్రకారం ఇప్పటి వరకు 18 అవగాహన కార్యక్రమాలను చేపట్టామన్నారు. విద్యాసంస్థలకు 100 గజాల పరిధిలో ఎక్కడ కూడా టోబాకో, మద్యం విక్రయాలు జరుగకుండా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో డ్రగ్స్‌టెస్ట్ నిర్వహిం చేందుకు వీలుగా పోలీసులు, ఎక్సైజ్ శాఖల వద్ద అవసరమైన మేర మూత్ర పరీక్ష ల కిట్లు అందుబాటులో పెట్టామన్నారు. డ్రగ్స్‌మాదక ద్రవ్యాల నియంత్రణ కోసం జిల్లా నార్కోటిక్ సమావేశంలో పాల్గొనే ప్రతి శాఖ ప్రత్యేక కార్యాచరణను రూపొందించుకుని అమలుచేయాలని కోరారు. డ్రగ్స్ వల్ల కలిగే విపరీత పరిణామాలపై అవగాహన కల్పిస్తూ వాటి నియంత్రణకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. మాదక ద్రవ్యాల రవాణా, సాగు, వినియోగం నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఎక్కడ గంజాయి సాగు జరుగకుండా పక్కా పర్యవేక్షణ చేపట్టాలన్నారు. గంజాయి సాగు చేసే రైతులకు ప్రభుత్వం నుంచి వచ్చే అన్నిరకాల సహాయాన్ని రద్దు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. గంజాయి సాగు కేసులలో నిందితులకు శిక్షపడేలా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలోని గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో ఎక్కడా చిన్నపిల్లలకు సిగరెట్,మద్యం అమ్మకుండా చూడాలని దీనిపై గ్రాపంచాయితీల్లో తీర్మానాలు చేయాలన్నారు. జిల్లాలోని ఆసుపత్రులు, మెడికల్ షాపులల్లో స్టాక్ వివరాలను ప్రతి నెలఆ తనిఖీ చేయాలని డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌కు సూచించారు. చెడు అలవాట్ల వల్ల ఆరోగ్యం దెబ్బతింటుందని, ఆలోచనా విధానం ఆలోచనా శక్తి నశిస్తాయని అన్నారు. జిల్లా ఎస్పీ మహేష్‌బిగీతే మాట్లాడుతూ జిల్లాకు గంజాయి రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. డ్రగ్స్ నియంత్రణ కోసం అన్ని శాఖల అధికారులు సమన్వయంలో పనిచేయాలన్నారు. జిల్లాకు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వలస కార్మికులపై నిఘా పెట్టాలన్నారు. ఈ సమావేశంలో సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు, వేములవాడ ఆర్డీవో రాధాబాయి, వ్యవసాయశాఖ జిల్లా అధికారి అఫ్జల్‌బేగం, జిల్లా విద్యాశాఖ అధికారి వినోద్‌కుమార్ మున్సిపల్ కమిషనర్‌లు అన్వేష్, ఖాదర్‌పాషా అధికారులు పాల్గొన్నారు.

పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలి

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఎంఈవో కృష్ణహరి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతిరెడ్డిలు అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ మోదీ కానుకగా కేటాయించిన సైకిళ్లను స్థానిక నాయకులతో కలిసి శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటరమణ బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, నాయకులు బుగ్గారెడ్డి, గణేశ్, బాలగౌడ్, లక్ష్మణ్, రంజిత్‌కుమార్, కిరణ్‌నాయక్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలి

- ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్స్, స్కాలర్‌షిప్‌లను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విడుదల చేసి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని, అలాగే రాష్ట్ర విద్యాశాఖ మంత్రిని నియమించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్ డిమాండ్ చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ అధ్వర్యంలో సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో శనివారం విద్యార్థులతో ఫీజు దీక్షను నిర్వహించారు. ఈ దీక్షలను ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మాజీ కార్యదర్శులు మల్లారపు అరుణ్‌కుమార్, ఎరవెల్లి నాగరాజులు ఎస్‌ఎఫ్‌ఐ నాయకులతోపాటు విద్యార్థులకు దండలు వేసి దీక్షలను ప్రారంభించగా డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు గొంతుల మహేష్, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎగమంటి ఎల్లారెడ్డి, కోడం రమణలు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ప్రశాంత్ మాట్లాడారు. ఈ దీక్షలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు గుండెల్లి కళ్యాణ్, ఉపాధ్యక్షుడు జూలపల్లి మనోజ్‌కుమార్, గర్ల్స్ కన్వీనర్ సంజన, జిల్లా కమిటీ సభ్యులు శివ, భరత్, జశ్వంత్, నాయకులు తిరుపతి, మహేష్, నవీన్, శివచరణ్, అజయ్, దినకర్, ప్రసంగి, జలంధర్, అఖిల, అక్షయ, ప్రత్యూష తదితరులు పాల్గొన్నారు.

అన్నపూర్ణ రిజర్వాయర్‌లో బీఆర్‌ఎస్ నాయకుల పూజలు



సమావేశంలో మాట్లాడుతున్న సిద్దం వేణు

ఇల్లంతకుంట, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి):కూలిపోయిందని తప్పుడు ప్రచారం చేసిన కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఇప్పుడు నీటిని ఎలా ఎత్తిపోస్తున్నారని జడ్పీ మాజీ వైస్ చైర్మన్ సిద్దం వేణు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహ్మారెడ్డిలు ప్రశ్నించారు. మండలంలోని అనంతగిరి గ్రామసమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లో శనివారం పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణను ఎడారిగా మార్చాలనే లక్ష్యంతోనే సీఎం మేడిగడ్డ బరాజ్‌కు మరమ్మతులు చేయడంలేదని విమర్శించారు. లక్షల క్యూజెక్కుల నీరు వృధాగా పోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. మానకొండూర్ ఎమ్మెల్యే సత్యనారాయణ అధికారులతో మాట్లాడి ఇల్లంతకుంట, బెజ్జంకి మండలాలోని చెరువులను నింపాలని డిమాండ్ చేశారు. చెరుకుపల్లి రాజిరెడ్డి, ఒగ్గు నర్సయ్యయాదవ్, కేవీఎస్‌రెడ్డి, ఉడుతల వెంకన్న, బిల్లవేని పర్శరాం, సాదుల్, సత్యనారాయణరెడ్డి, ఒరుపుల రాములు, అంజయ్య, బాలగౌడ్, ఒల్లాల రవి, శ్రీనివాస్, భాస్కర్, సంతోష్‌రెడ్డి, బాబు, వెంకన్న, సతీష్, బాలయ్య, చంద్రమౌళి, బాలకిషన్, శ్రీనివాస్, కనుకయ్య, బాలయ్య, అశోక్, నవీన్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని బీజేపీ నేతల ర్యాలీ



రుద్రంగిలో బైక్ ర్యాలీలో పాల్గొన్న బీజేపీ నాయకులు

వేములవాడ రూరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ భారతీయ జనతా పార్టీ నాయకులు పెద్దఎత్తున తహసీల్దార్ కార్యాలయానికి తరలివచ్చారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రూరల్ తహసీల్దార్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు బూరుగుపల్లి పర్శరాములు, నాయకుడు అల్లాడి రమేష్, మాజీ ఎంపీపీ, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బండ మల్లేశం, మండల అధికార ప్రతినిధి స్కురి నరేందర్, ప్రధాన కార్యదర్శులు తోశేఖర్, వనపర్తి పర్శరాములు, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

● ముస్తాబాద్ : ముస్తాబాద్ మండలంలో పెండింగ్‌లో ఉన్న మౌలిక వసతులను కల్పించాలని బీజేపీ మండల అధ్యక్షుడు సౌల్ల క్రాంతి ఆధ్వర్యంలో ర్యాలీ తీశారు. మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని, 30 పడకల ఆసుపత్రి నిర్మించాలని డిమాండ్ చేస్తు ప్రధాన రహదారి గుండా ర్యాలీ తీశారు. మండల కేంద్రంలోని స్థానిక సమస్యలపై ర్యాలీ నిర్వహించి స్థానిక తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి ఏదునూరి గోపి, బుచ్చెల్లి మహేశ్వరి జిల్లా ఉపాధ్యక్షులు మల్లారపు సంతోష్‌రెడ్డి, మీస సంజీవ్, కరెడ్ల మల్లారెడ్డి, చిట్నేని శ్రీనివాస్‌రావు, కరెడ్ల రమేశ్, బెదురు ప్రశాంత్, గుండవేని తిరుపతి, కాసోడి రమేశ్, నర్ర ప్రశాంత్ , వరి వెంకటేశ్,పప్పుల శ్రీకాంత్, ఒరగంటి సత్యం, అజయ్, కనుకయ్య, పద్మ తదితరులు పాల్గొన్నారు.

● రుద్రంగి : రుద్రంగి మండల కేంద్రంలో ప్రజా సమస్యలపై, రైతుల సమస్యలపైన బీజేపీ మండల అధ్యక్షుడు కర్నవత్తుల వేణు ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. బైక్ ర్యాలీ అంబేద్కర్ చౌరస్తా నుండి ఇందిరాచౌక్ చౌరస్తా వరకు బైక్ ర్యాలీ తీసి సమస్యలపై తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు కర్నవత్తుల వేణు, జిల్లా ప్రధాన కార్యదర్శి సిరికొండ శ్రీనివాస్, సినియర్ నాయకులు పడాల గణేష్, బాలకిషన్‌రావు, బోయ నర్సారెడ్డి, బిజేపి నాయకులు పాల్గొన్నారు.

అసత్య ప్రచారాలను నమ్మవద్దు..

- డీజేలకు అనుమతులు లేవు
- సీఐ శ్రీనివాస్

వేములవాడ రూరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): సోషల్‌మీడియా వేదికగా వస్తున్న అసత్యప్రచారాలను నమ్మవద్దని రూరల్ సీఐ శ్రీనివాస్ అన్నారు. వేములవాడ రూరల్ మండల గణపతి మండప నిర్వాహక సభ్యులతో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ గణపతి పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. వినాయక ఊరేగింపులలో డీజేలకు అనుమతులు లేవన్నారు. వినాయక విగ్రహాలు ప్రతిష్టించే ప్రతీఒక్కరు పూర్తి వివరాలు సమర్పించి పోలీస్‌స్టేషన్లో అనుమతులు తీసుకోవాలన్నారు. నమోదు చేసుకున్నవారి వివరాలు ఆధారంగా ఆన్‌లైన్ ద్వారా విగ్రహాలకు జియోట్యాగింగ్ చేస్తామన్నారు. గణేష్ మండపాల వద్ద కమిటీలు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. మండపాల వద్ద ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడవద్దన్నారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సోషల్‌మీడియాలో వచ్చే అసత్యప్రచారాలను నమ్మకుండా అందులో ఎంత నిజముందని తెలుసుకోవాలన్నారు. మతవిద్వేషాలు రెచ్చగొట్టేలా పోస్టులు పెడితే కఠిన చర్యలుంటాయన్నారు. కార్యక్రమంలో రూరల్ ఎస్సై అంజయ్య పాల్గొన్నారు.

● ముస్తాబాద్ : వినాయక నవరాత్రి ఉత్సవాలను నిబంధనలకు లోబడి జరుపుకోవాలని సీఐ మొగిలి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని యాదవ సంఘం ఫంక్షన్ హాల్‌లో శనివారం వినాయక నవరాత్రి ఉత్సవాల నిర్వాహకులతో సమావేశాన్ని నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో ఉత్సవాలను నిర్వహించుకోవాలని, డీజేల వినియోగం ఉండొద్దని పేర్కొన్నారు. సమయ పాలనతో మైక్‌లు నడవాలని మైక్ పర్మిషన్ తీసుకోవాలన్నారు. నిబంధనలను ఉల్లంఘించొద్దన్నారు. కార్యక్రమంలో ఎస్సై సీహెచ్ గణేశ్, పీసీలు తదితరులు పాల్గొన్నారు.

● తంగళ్లపల్లి : ప్రశాంత వాతవరణంలో నవరాత్రి ఉత్సవాలు జరుపుకోవాలని రూరల్ సీఐ మొగిలి సూచించారు. శనివారం తంగళ్లపల్లి మండల కేంద్రంలో ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో గణేశ్ మండపాల నిర్వాహకులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లడుతూ గణేశ్ మండపాల వద్ద సీసీ కెమారాలను అమర్చుకోవాలని సూచించారు. మండపాల వద్ద డీజే సౌండ్ ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బందులు కలిగించవద్దని అన్నారు. నిమజ్జనం రోజు ఉదయం నుంచే వినాయక శోభాయాత్ర నిర్వహించుకోవాలన్నారు. ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మండల పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామని ప్రజలు, మండప నిర్వాహకులు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో ఎస్‌ఐ ఉపేంద్ర చారి, మండప నిర్వహకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రూరల్ సీఐ శ్రీనివాస్

● కోనరావుపేట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : వినాయక మండపాల నిర్వాహకులు ప్రతి మండపంలో ఒక సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు సూచించారు. కోనరావుపేట పోలీస్ స్టేషన్‌లో శనివారం మండలంలోని ఆయా గ్రామాల మండపాల నిర్వాహకులతో సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. వినాయక చవితి ఉత్సవాలు శాంతియుతంగా జరుపుకోవాలని అన్నారు. ఎలాంటి గొడవలు చేసినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ సందర్భంగా ఎస్సై ప్రశాంత్ రెడ్డి, ఏఎస్‌ఐ తిరుమల్, సిబ్బంది ఉన్నారు.

ప్రభుత్వ హామీని నెరవేర్చాలి

- ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి పుట్ట రవి

కోనరావుపేట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు పెన్షన్ పెంచుతామని ఇచ్చిన హామీని నెరవేర్చాలని ఎమ్మార్పీఎస్ సిరిసిల్ల జిల్లా ఇంచార్జి పుట్ట రవి అన్నారు. కోనరావుపేట మండలం మల్కపేట గ్రామంలో వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, బీడీ కార్మికులు, నేత కార్మికులు చేయూత పెన్షన్‌దారులతో సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వం చేయూత పెన్షన్ పెంచాలని అన్నారు. సమస్యల పరిష్కారం కోసం సెప్టెంబర్ 9న హైదరాబాద్‌లో నిర్వహించే మహా గర్జనను విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి ఎలగందుల బిక్షపతి, పెన్షన్ అధికారులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలలో వైద్య శిబిరం

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్థానిక ఓ ప్రైవేటు ఆసుపత్రి సహకారంతో శనివారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ప్రిన్సిపాల్ పద్మావతి, వైద్యులు అభినయ్, మహేశ్, నవనీత్, వైద్య సిబ్బంది రమేశ్, అరవింద్, హరీష్, శ్యామల, ప్రసన్న, ఎన్ఎస్ఎస్ అధికారి గంగాధర్, అధ్యాపకులు సత్యనారాయణ, పర్శరాములు, చంద్రమౌళి, విష్ణు ప్రసాద్, రవిచంద్ర, భూమక్క, గౌతమి, సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

నెరవేరుతున్న పేదల సొంతింటి కల

- కోనరావుపేట మండలంలో చురుగ్గా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం



పల్లిమక్తలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇల్లు

కోనరావుపేట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : పేదల స్వంతింటి కల నెరవేరుతోంది. ఇల్లు కట్టుకోవడానికి ఆర్థిక స్తోమత లేక సొంతింటి కల నెరవేరక సతమతమవుతున్న పేద వారికి ప్రజాప్రభుత్వ పాలనలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కావడంతో వారి కల సాకారం అవుతోంది. పేదల కలను నెరవేర్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజా ప్రభుత్వ పాలనలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సహకారంతో కోనరావుపేట మండలానికి 652 ఇళ్లు మంజూరయ్యాయి. ఇందులో 444 ఇళ్లకు అధికారులు ముగ్గులు పోసి పనులు ప్రారంభించారు. 250 ఇళ్లు బేస్‌మెంట్ వరకు రాగా మరో 12 ఇళ్లు గోడలు లేచాయి. 250 ఇళ్లకు ఒక్కొక్క ఇంటికి లక్ష రూపాయల చొప్పున వారి ఖాతాలో జమ అయ్యాయి. ఇందిరమ్మ ఇళ్లు 60 గజాలు మించకుండా 40గజాలకు తగ్గకుండా ఇంటి నిర్మాణం చేపడుతున్నారు. కొలనూరు, గొల్లపల్లిలో పైలెట్ ఇందిరమ్మ ఇల్లు పూర్తి కావడంతో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా చేతుల మీదుగా ప్రారంభించి ఆ కుటుంబ సభ్యులకు తోబుట్టుగా భావిస్తూ నూతన వస్త్రాలను అందజేశారు. ప్రతి గ్రామంలో 10 నుంచి 20 ఇళ్లు మంజూరు కావడంతో పేదవారి సొంతింటి కల నెరవేరుతున్న తరుణంలో వారి ముఖంలో చిరునవ్వులు కనిపిస్తున్నాయి. ప్రభుత్వం అందిస్తున్న ఐదు లక్షల సహకారంతో పాటు మహిళా స్వశక్తి సంఘాల ద్వారా లక్ష రూపాయలు రుణాన్ని అందించడంతో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

దశలవారీగా లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నాం..

- హౌసింగ్ ఏఈ రాజశేఖర్

ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు దశలవారీగా వారి బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నాం. మండలంలో సుమారు 250 మంది లబ్ధిదారులకు లక్ష రూపాయల చొప్పున ఖాతాలో జమ చేశారు. కోనరావుపేటలో 562 ఇళ్లు మంజూరు కాగా, 444 ఇళ్లకు ముగ్గుపోశాం. 250 ఇళ్లు బేస్‌మెంట్ వరకు పూర్తి అయ్యాయి. మరో 12 ఇళ్లు గోడలు పూర్తికాగా, కొలనూరులో ఓ ఇల్లు పూర్తికాగా, పైలెట్ ఇల్లుగా ఎంపిక చేసి ప్రారంభించాం.

ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడం సంతోషంగా ఉంది

- మోకెనపల్లి చందన, పల్లిమక్త



మాకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడం సంతోషంగా ఉంది. గత కొన్ని సంవత్సరాలుగా ఇల్లు లేక ఇబ్బందులు పడుతున్నాం. ఇల్లు కటుకునే స్తోమత లేకపోవడంతో ఇందిరమ్మ ఇల్లు కోసం ఎదురుచూశాం. ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాకు ఇల్లు మంజూరు చేయడం సంతోషంగా ఉంది.

15 సంవత్సరాలుగా కిరాయి ఇంట్లో ఉంటున్నాం..

- దేవలక్ష్మి, పల్లిమక్త



మాకు ఇల్లు లేకపోవడంతో 15 సంవత్సరాలుగా ఓ ఇంటిలో కిరాయికి ఉంటున్నాం. డబుల్ బెడ్ రూమ్ ఇల్లు వస్తదని 10 సంవత్సరాలుగా ఎదురుచూశాం కానీ రాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సహకారంతో మాకు ఇల్లు మంజూరు అయింది. ఇందిరమ్మ ఇల్లును నిర్మించుకుంటున్నాం మాకు సంతోషంగా ఉంది.

దరఖాస్తుల ఆహ్వానం

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : వీర్నపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో తాత్కాలిక పద్ధతిలో భౌతిక శాస్త్రం బోధించేందుకు అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ప్రత్యేక అధికారి శకుంతల శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ(ఎంపీసీ), బీఎడ్ పూర్తి చేసిన అభ్యర్థులు ఈ నెల 26లోపు కేజీబీవీలో తమ దరఖాస్తులను నేరుగా సమర్పించాలని పేర్కొన్నారు. 8, 9, 10వ తరగతి విద్యార్థులకు భౌతిక శాస్త్రం బోధించాల్సి ఉంటుందని ప్రత్యేక అధికారి శకుంతల వివరించారు.

కాల్వ గండి పూడ్చివేత

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : సింగసముద్రం చెరువుకు గండి పడడంతో మండలకేంద్రంతో పాటు రాచర్లగొల్లపల్లి, రాచర్లబొప్పాపూర్ గ్రామాలకు చెందిన అన్నదాతలు శనివారం మట్టి సంచులు వేసి గండిని పూడ్చారు. రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి శ్రమదానం చేశారు. సింగసముద్రం చెరువు నిండితే కాల్వల ద్వారా గ్రామాల్లోని జక్కుల చెరువు, గాలం చెరువు, గిద్దె చెరువులోకి నీరు చేరనుందని రైతులు పేర్కొన్నారు. అధికారులు స్పందించి పనులను పూర్తి చేయాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

పట్టుపురుగుల పెంపకంతో ఆర్థికాభివృద్ధి

ఇల్లంతకుంట, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి) :పట్టు పరుగుల పెంపకం ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని మైసూర్‌లోని కేంద్ర సిల్క్ రిసెర్చ్ ట్రైనింగ్ సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ మల్లికార్జున పేర్కొన్నారు. మండలంలోని అనంతగిరి గ్రామంలో శనివారం మేరా రేషమ్ మేరా అభియాన్ కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ పంటలతో పోల్చితే పట్టుపురుగుల పెంపకం ద్వారా అధిక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. సమావేశంలో డాక్టర్ రాఘవేందర్, వ్యవసాయాధికారి సురేష్‌రెడ్డి, జిల్లా ఏఎస్‌వో జగన్, అర్చనలతో పాటు రైతులు పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను సంగారెడ్డి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి వెనక్కి తీసుకోవాలని బీఆర్‌ఎస్ నాయకుడు కంచర్ల రవిగౌడ్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రాన్ని తీసుకొచ్చిన కేసీఆర్, తెలంగాణను ఐటీ రంగంలో దేశంలోనే అగ్రగామిగా నిలిపిన కేటీఆర్‌పై ఆరోపణలు చేస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు వడ్లూరి సాయిసూర్య, ఎస్కే అఫ్రోజ్, శ్రీనివాస్‌రావు, కిరణ్, రాజేష్, అర్జున్, సంతోష్, నరేష్ పాల్గొన్నారు.

మండపాలు దూరంగా ఏర్పాటు చేసుకోవాలి

తంగళ్లపల్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో వినాయక మండపాలు విద్యుత్ వైర్లకు దూరంగా ఏర్పాటు చేసుకోవాలని సెస్ ఏఈ మధుకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నాయకులను మండపాలను తీసుకువచ్చే క్రమంలో విద్యుత్ వైర్లను కర్రతో పైకి జరిపి తీసుకవస్తున్నారని దీంతో ప్రమాదాల బారిన పడుతరన్నారు, విద్యుత్ సిబ్బంది పర్యవేక్షణలో వినాయకులను తీసుకురావాలని సూచించారు. మండపాలకు విద్యుత్ శాఖ అనుమతి తీసుకోవాలన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పురోగతిపై సమీక్ష..

తంగళ్లపల్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పురోగతిపై ఎంపీడీవో లక్ష్మీనారయణ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. శనివారం తంగళ్లపల్లి మండల పరిషత్ కార్యలయం అవరణలో కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం త్వరగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రేమ్మైన ఇబ్బందులు తలెత్తితే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో మీర్జా, కార్యదర్శులు సలీం, వాణి, రవీందర్, రాజు, సమీర్, రఘు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చందుర్తి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగునట్లు సెస్ ఏఈ మహేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవీ చందుర్తి ఫీడర్‌లో పని జరుగుతున్నందున చందుర్తి మండల కేంద్రంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందన్నారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

చందుర్తి, ఆగస్టు23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సనుగుల ప్రాథమిక పాఠశాలలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను శనివారం నిర్వహించారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రేగొండ సత్యనారాయణ కటుకూరి ముఖేష్, కోరెపు శ్రీనివాస్, నాతరి నాగమణి, చింతల హరిష్మా ,మాదవి, నవ్య పాల్గొన్నారు.

● కోనరావుపేట : మండలంలోని కొలనూరులో మార్గదర్శి విద్యానికేతన్ స్కూల్లో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు కరస్పాండెంట్ మండల చిరంజీవి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్లో ఉన్న చిన్న పిల్లలతో శ్రీకృష్ణుని గోపికల వేషదరణ వేసి కల్చరల్ యాక్టివిటీస్ నిర్వహించి కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మంద కృష్ణమాదిగ

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బండలింగంపల్లికి చెందిన తెలంగాణ యువజన, పర్యాటక మరియు సాంస్కృతిక సలహా మండలి సభ్యులు దరువు ఎల్లన్న సోదరుడు శంకరయ్య ఇటీవల మృతిచెందాడు. ఆయన కుటుంబ సభ్యులను శనివారం రాత్రి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, పద్మశ్రీ మందకృష్ణమాదిగ పరామర్శించారు. వెంట జిల్లా ఇన్‌చార్జి రవి, లక్ష్మణ్, బిక్షపతి, శరవింద్, శ్రీనివాస్, శోభారాణి తదితరులు ఉన్నారు.

రేషన్ కార్డుల పంపిణీ

తంగళ్లపల్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంతో పాటు పాపయ్యపల్లె గ్రామాల్లో లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డుల పంపిణీ జరిగింది. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జల్గం ప్రవీణ్, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ నేరెళ్ల నర్సింగం గౌడ్, నాయకులు మచ్చ శ్రీనివాస్, సుద్దాల శ్రీనివాస్, లింగాల భూపతి, మునిగేల రాజు, సత్తు శ్రీనివాస్‌రెడ్డి, రాపెల్లి ఆనందం, సామాల రమేశ్, హమీద్, ఎగుర్ల ప్రశాంత్, ఎడ్మాల ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

చందుర్తి ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం, నర్సింగాపూర్ ప్రాథమిక పాఠశాలలో జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా శనివారం భారతీయ వ్యోమగాముల ఫోటో ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఇస్రో ఆధ్వర్యంలో నిర్వహించే భారతీయ అంతరిక్ష కార్యక్రమాలు వాటి విజయాలను, ఉపయోగాలను ప్రధానోపాధ్యాయుడు జలంధర్‌రెడ్డి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంపతి రమేష్, ఎం అనిత, బి.రాజు, ప్రణవి, లాస్య తదితరులు పాల్గొన్నారు.

స్థానికుల సహకారంతో గుంతల పూడ్చివేత

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని వంతెన వద్ద ప్రమాదకరంగా ఏర్పడిన గుంతలను ట్రాక్టర్, జేసీబీ యజమానుల సహకారంతో స్థానికులు శనివారం గుంతలను పూడ్చి వేశారు. గుంతల వల్ల తరచూ ప్రమాదాలు చోటుచేసుకోవడంతో జేసీబీ, ట్రాక్టర్ యజమానులు లింబాద్రి, రాములు, లింబాద్రి, నర్సయ్య, రవిలు స్వచ్ఛందంగా ముందుకువచ్చారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ లక్ష్మణ్, డైరెక్టర్ చంద్రమౌళి, తాజా, మాజీ ఎంపీటీసీ అరుణ్‌కుమార్, తాజా, మాజీ ఉపసర్పంచ్ రవి, నాయకులు దేవయ్య, హన్మంతు, శ్రీనివాస్, బాలరాజు, లచ్చయ్య, అజయ్, వసంత్, కారోబార్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు జాతీయ స్థాయిలో రాణించాలి

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంత విద్యార్థులు విద్యతో పాటు జాతీయస్థాయి క్రీడల్లో రాణించాలని ఎస్‌ఐ లక్ష్మణ్ అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన మండల స్థాయి క్రీడా పోటీలు శనివారం ముగిశాయి. ముఖ్యఅతిథిగా ఎస్‌ఐ లక్ష్మణ్ హాజరై మాట్లాడారు. ఎంఈవో శ్రీనివాస్, సెస్ డైరెక్టర్ మల్లేశం, నాయకులు శ్రీనివాస్, తిరుపతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు జరుపుకోవాలి

గంభీరావుపేట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : వినాయక నవరాత్రి ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్‌ఐ రమాకాంత్ సూచించారు. గంభీరావుపేట రెడ్డి సంఘ భవనంలో శనివారం గనేశ్ మండప నిర్వాహకులతో సమావేశాన్ని ఏర్పాటుచేసి, నవరాత్రి ఉత్సవాలు, విధి నిర్వహణపై అవగాహన కల్పించారు. ఆర్‌ఐ సత్యం, సెస్ ఏఈ ఆనంద్‌కుమార్ తదితరులు ఉన్నారు.